టాప్ న్యూస్

## కాంగ్రెస్‌తో పొత్తుకు విజయ్ సై



- విజయ్ పార్టీ తమిళగ వెట్రి కళగం సంకేతాలు

02

## ఉత్తమ్‌కు డాక్టరేట్ ఇవ్వాల్సిందే అధ్యక్షా..



- సభలో సీఎం రేవంత్ ప్రశంసలు

02

## బంగారం రూ.2 లక్షలు.. వెండి రూ.3 లక్షలు?



02



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

## అసెంబ్లీలో రేవంత్ చాణక్యం

తెలంగాణ అసెంబ్లీలో కొత్త ముఖచిత్రం. ఒకవైపు పూర్తిగా ప్రిపేర్ అయి వచ్చిన అధికారపక్షం.. మరోవైపు బాయ్‌కాట్ పేరుతో సభను వీడిన ప్రతిపక్షం. నీళ్లపంచాయతీని మొదలుపెట్టిన బీఆర్ఎస్ సీఎం రేవంత్ రెడ్డి చాణక్యం ముందు తేలిపోయింది. ఎపుడూ నీళ్లవిషయంలో తమకు మాత్రమే అవగాహన ఉందని, కిందపడ్డా.. నీళ్లవిషయంలో సర్కారును ఇరకాటంలో పెట్టవచ్చని భావించిన బీఆర్ఎస్ ఎత్తులు పారలేదు. చివరకు ప్రిపేర్ కాలేదని బయటపడాల్సిన పరిస్థితి అధికారపక్షం కల్పించడం కాంగ్రెస్ సర్కారు వ్యూహ విజయమే. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావించాక బిఆర్ఎస్ కు ఇలాంటి పరిస్థితి ఎపుడూ ఎదురుకాలేదు. గత రెండేళ్ళుగా కూడా.. బిఆర్ఎస్ ను కాంగ్రెస్ సభలో ఇంతలా డిఫెన్స్ లో పడేయలేదు. తెలంగాణ రాజకీయాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాధించిన సాధికారితకు, పట్టుకు సభ సాక్షిగా కనిపిస్తోంది. జూబ్లీహిల్స్ విజయం, పంచాయతీ విజయాలు, ఇటీవల కాలంలో పెరిగిన ముఖ్యమంత్రి గ్రాఫ్, ఎత్తుగడలు సొంతపక్షంలో మద్దతు పెంచగా, ఎదుటిపక్ష ఆత్మవిశ్వాసం దెబ్బతీసింది. బిఆర్ఎస్ కు ఎమ్మెల్సీ, కేసీఆర్ కుమార్తె కవిత పెనుసవాల్ గా మారగా, హరీష్ ను ముందుపెట్టి చేసే రాజకీయాన్ని కవిత తునాతునకలు చేస్తోంది. కేసీఆర్ సభకు రాకుంటే బీఆర్ఎస్ కథం అని కవిత ప్రకటించడం పెద్ద స్టేట్ మెంట్. బిఆర్ఎస్ పార్టీకి రెండేళ్ళతర్వాత ఉపనేతలను నియమించినా సభలో మైలేజీని ఆ పార్టీ తీసుకోలేకపోయింది. తెలంగాణోళ్ళ దిష్టి కొబ్బరిచెట్లకు తగిలింది అంటూ వ్యాఖ్యానించి విమర్శల పాలైన జనసేన అధినేత పవన్ కల్యాణ్ నష్టనివారణ చర్యల్లో భాగం టిటిడిని ఒప్పించి కొండగట్టు అంజన్నకు నిధులిప్పించి బ్యాలెన్స్ చేసుకున్నట్లు కనబడుతోంది.

- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్

ఎడిటోరియల్ పేజీ 4లో ▸


ANN తెలుగు

Follow: @mahaadaily

04-01-2026

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్

సంపుటి- 22 సంచిక- 11 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




వెనిజులా అధ్యక్షుడు మదురోను

## బంధించిన అమెరికా సైన్యం

### ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ట్రంప్

**మహా:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ సైన్యం చేతచిక్కిన వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురోకు సంబంధించిన ఒక ఫొటోను తన 'ట్రూత్ సోషల్' ప్లాట్‌ఫామ్‌లో విడుదల చేశారు. కళ్లకు గంతలు కట్టి, చేతులు కట్టేసి ఉన్న మదురో... యూఎస్ నేవీకి చెందిన యుద్ధనౌక యూఎస్ఎస్ ఐవో జిమాపై ఉన్నట్లు ఆ ఫొటోలో కనిపిస్తోంది. "నికోలస్ మదురో యూఎస్ఎస్ ఐవో జిమా నౌక పై ఉన్నాడు" అని ట్రంప్ ఆ ఫొటోకు క్యాప్షన్ ఇచ్చారు. వెనిజులా రాజధాని కారకాస్‌లో అమెరికా సైన్యం భారీ సైనిక ఆపరేషన్ నిర్వహించి మదురోను, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను అదుపులోకి తీసుకోవడం తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో యూఎస్ ఆర్మీకి చెందిన 'డెల్టా ఫోర్స్' కీలక పాత్ర పోషించింది. ఈ ఆపరేషన్ వివరాలను ఫాక్స్ ఫ్రెండ్స్ కార్యక్రమంలో ట్రంప్ పంచుకున్నారు. కొంతమంది అమెరికా సైనికులు గాయపడ్డారని, అయితే ప్రాణనష్టం జరగలేదని ఆయన తెలిపారు. నార్కోటెర్రరిజం, డ్రగ్ ట్రాఫికింగ్ ఆరోపణల కింద మదురో దంపతులు న్యూయార్క్‌లో విచారణ ఎదుర్కోనున్నట్లు తెలుస్తోంది. ఈ ఆపరేషన్ సమయంలో కారకాస్‌లో భారీ పేలుళ్లు, తక్కువ ఎత్తులో విమానాల సంచారంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఇది అమెరికా దురాక్రమణేనని వెనిజులా ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది.



## బెంగళూరులో ఇళ్ల కూల్చివేత డ్రైవ్

### సమర్థించిన శశిథరూర్

**మహా:** బెంగళూరులో కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన ఇళ్ల కూల్చివేతలపై కాంగ్రెస్ పార్టీకి చెందిన తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ స్పందించారు. ఉత్తర బెంగళూరులోని కోగిలు ప్రాంతంలోని వసీ లేఅవుట్, ఫకీర్ కాలనీలలో ప్రభుత్వం ఇళ్ల కూల్చివేత కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కూల్చివేతలను శశిథరూర్ సమర్థించారు. ఇవి చట్టపరమైన విధానాలకు లోబడే జరుగుతున్నాయని, నిర్వాసితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా ప్రభుత్వం చేస్తుందని ఆయన వెల్లడించారు. కూల్చివేతకు గురైన ఇళ్లు ప్రభుత్వ భూముల్లో నిర్మించారని ఆయన తెలిపారు. అక్కడ నివసిస్తున్న ప్రజలు చట్టవిరుద్ధంగా ఉంటున్నారని ఆయన స్పష్టం చేశారు. ఆ భూములు ప్రభుత్వానికి చెందినవని, అంతేకాకుండా అది వ్యర్థాలను పారవేసే ప్రాంతమని, అక్కడ అక్రమంగా ఇళ్లు నిర్మించారని ఆయన పేర్కొన్నారు. విషపూరిత వ్యర్థాలు అక్కడి జలాలను కలుషితం చేయడం వల్ల అది ఎంత మాత్రం సురక్షితం కాదని అన్నారు. నివసించడానికి ఆ ప్రాంతం ఏమాత్రం అనుకూలం కాదని థరూర్ తెలిపారు. కూల్చివేతలకు సంబంధించి అక్కడ నివసిస్తున్న వారికి ముందుగానే నోటీసులు జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు. నిర్వాసితులకు ప్రత్యామ్నాయ గృహాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కూల్చివేతల వల్ల పేద ప్రజలకు అన్యాయం జరుగుతోందనే ప్రచారాన్ని ఆయన ఖండించారు.

## కృష్ణా జలాల్లో.. తెలంగాణకు ద్రోహం

# చేసింది కేసీఆరే

### తోలుతీస్తాం.. బట్టలిప్పుతాం అన్నోళ్ళు

## ఎటు పోయిండ్రు

సభలోనే ద్రోహులెవరో ముఖాముఖి తేల్చుదామనుకున్నాం

నీళ్ళనిజాలపై చర్చలో సీఎం రేవంత్ రెడ్డి

ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ కు ప్రశంసలు

పాలమూరుకు కేంద్రం అన్ని అనుమతులు ఇవ్వాలని అసెంబ్లీతీర్మానం



**(హైదరాబాద్ -మహా )**

'సభలో కేసీఆర్ విలువైన సలహాలు, సూచనలు చేస్తే స్వీకరించాలనుకున్నాం. అలాగే మేం పాలమూరుకు అన్యాయం చేస్తున్నామని కేసీఆర్ అన్నారు. ప్రభుత్వం తోలు తీస్తాం.. బట్టలిప్పుతామన్నారు. దీంతో సభలోనే ముఖాముఖి చర్చ ద్వారా ద్రోహులు ఎవరో తేల్చుదామనుకున్నాం. కానీ బీఆర్ఎస్ సభను బహిష్కరించింది'' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా నదీ ప్రాజెక్టులపై ప్రజలకు వాస్తవాలు తెలియాల్సి ఉందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, గడిచిన పదేళ్లలోనూ మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శాసనసభ శీతాకాల సమావేశాల సందర్భంగా నీళ్లు నిజాలుపై జరిగిన స్వల్పకాల చర్చలో ఆయన ప్రసంగించారు. ఎంతో అనుభవం ఉన్న మాజీ సీఎం కేసీఆర్ సభకు వచ్చి సలహాలు, సూచనలు ఇస్తారనుకున్నానని రేవంత్ రెడ్డి అన్నారు. సభల్లో మాట్లాడిన దానికంటే అసెంబ్లీలో ప్రసంగించిన

మిగతా 2లో ▸

### ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్

అసెంబ్లీలో తెలంగాణ ప్రభుత్వం కీలక తీర్మానాలు చేసింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్రం అన్ని అనుమతులు ఇవ్వాలని తీర్మానం చేసింది. అలాగే గోదావరి జలాల తరలింపునకు ఏపీకి కేంద్రం ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని తీర్మానం చేసింది. శనివారం అసెంబ్లీలో కృష్ణా జలాల అంశంపై ప్రభుత్వం చర్చ నిర్వహించింది. ఈ సందర్భంగా రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి సైతం కృష్ణా జలాల అంశంపై సుదీర్ఘంగా చర్చించి గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కృష్ణా జలాల్లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని క్షుణ్ణంగా వివరించారు.



## పవన సుతుడి సేవలో పవర్ స్టార్

### కొండగట్టు అభివృద్ధికి కరసేవకుడిగా కదులుతా

గిరి ప్రదక్షణకు సహాయ సహకారాలు అందిస్తా..

రూ.35.19 కోట్లతో దీక్ష విరమణ మండపం 96 గదుల వసతి సముదాయ పనులకు శ్రీకారం

ఆలయాలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఏపీ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్

**కొండగట్టు నుండి మహా ప్రతినిధి:**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శనివారం ఇష్టదైవము తమ ఇలవేల్పు కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి సేవలో తరించారు శనివారం ఉదయం కొండగట్టుకు చేరుకున్న ఆయన స్వామి వారిని ప్రత్యేకంగా దర్శించుకున్నారు. స్వామివారికి నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తి పూర్వకంగా ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం అనంతరం 2024లో శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఆలయాన్ని సందర్శించిన సందర్భంలో కొండగట్టు అంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని మాటిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం రూ. 35.19 కోట్ల అంచనా వ్యయంతో టి.టి.డి. సహకారంతో నేడు దీక్ష విరమణ మండపం, 96 గదుల సత్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మొదట హెలికాప్టర్ ద్వారా జేఎన్టీయూ చేరుకున్న పవన్ కళ్యాణ్ కు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్ జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ స్థానిక ప్రజా ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత టి.టి.డి. ఛైర్మన్ బి.ఆర్.నాయుడు, తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ఆలయానికి చేరుకున్న పవన్ కళ్యాణ్ కు తెలంగాణ దేవాదాయశాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యార్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

మిగతా 2లో ▸

## అసెంబ్లీలో కేసీఆర్‌పై అతడు సినిమా స్టోరీ చెప్పిన రేవంత్

**హైదరాబాద్, మహా:** పాలమూరు ప్రాజెక్టుపై చర్చ సందర్భంగా తెలంగాణ అసెంబ్లీలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ప్రాజెక్టులతో కేసీఆర్ ఏవిధంగా ప్రజాధనం దుర్వినియోగం చేశారు..ఏవిధంగా ప్రాజెక్టుల అంచనా వ్యయం పెంచి దోచుకున్నాడో చెప్పే క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి అతడు సినిమా స్టోరీని చెప్పడం ఆసక్తికరంగా మారింది. అతడు సినిమాలో ఓ లీడర్ ను పై నుంచి ఎవడో కాలుస్తాడు. ఎంక్వైరీకి వచ్చే సీబీఐ ఆఫీసర్ .. ఎవడు హత్య చేసి ఉండొచ్చని జైలులో ఉన్న పాత క్రిమినల్స్ ను ఆరాదీస్తాడు. ప్రతి నేరగాడికి ఓ ప్యాటర్న్ ఉంటుంది. జేబులు కొట్టే వాడికి, చైన్ లు దోచేవాడికి , కేసీఆర్ లా ప్రాజెక్టుల అంచనాలు పెంచి దోచుకునే వాళ్లకు ఓ విధానం ఉంటుందని సీఎం తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ద్వారా రూ. 55 వేల కోట్లు కొల్లగొట్టాలని కేసీఆర్ ప్లాన్ వేశారు. డీపీఆర్ లేకుండా 25 వేల కోట్లు ఖర్చు చేశారు. తుమ్మిడిహట్టి దగ్గర ప్రాణహిత చేవెళ్ల కట్టకుండా మేడిగడ్డ దగ్గర కాళేశ్వరం నిర్మించి అంచనాను రూ. 38,500 కోట్ల నుంచి లక్ష కోట్లకు పెంచారు.అలాగే జూరాల దగ్గర కట్టాల్సిన పాలమూరును శ్రీశైలానికి మార్చి రూ. 32,800 కోట్ల నుంచి 90 వేల కోట్లకు అంచనా వ్యయాన్ని పెంచారు. ఇలా కేసీఆర్ పంపులు, లిఫ్ట్ ల పేరుతో అంచనా వ్యయం పెంచి వేల కోట్లు దోచుకున్నాడు తప్ప కొత్తగా ఒక్క ఎకరానికి సాగునీరియ్యలేదని చెప్పారు రేవంత్ . రేవంత్ అతడు స్టోరీ చెప్పినపుడు సభలో ఒక్కసారిగా నవ్వులు విరిశాయి.

## చత్తీస్ గడ్ బస్తర్‌లో భారీ ఎన్ కౌంటర్

### ఎదురు కాల్పులో 12 మంది మావోయిస్టులు మృతి



**చర్ల, మహా :** ఛత్తీస్ గడ్, బస్తర్ ప్రాంతంలో సుకుమా జిల్లా కిష్టారం లో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. కొంటా కిష్టారం అడవుల్లో జరిగిన ఈ ఎన్కౌంటర్లో భద్రతాబలగాలకు మావోయిస్టులకు మధ్య భీకర కాల్పులు జరిగాయి. 12 మంది మావోయిస్టులు మృతి చెందారు కొంటా ఏరియా కమిటీకి చెందిన ఏసీఎం హితేష్ కూడా ఉన్నారు. కొంటా ఏరియా కమిటీ సభ్యులు ఒక్కరు కూడా మిగలలేదు. కమిటీ సభ్యులందరూ చనిపోయారు. వీరి వద్ద నుండి అధునాతన ఆయుధాలు స్వాధీనం చేసుకున్న భద్రతాబలగాలు ఘటనా స్థలం నుంచి ఏకె 47 రైఫిల్స్ 3,ఇన్సాస్ ఇతర ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారని సుకుమా జిల్లా ఎస్పీ కిరణ్ చావ్ తెలిపారు.



## యూరియా ఫుల్

### రైతులు కంగారు పడొద్దు

అసెంబ్లీలో మంత్రి తుమ్మల ప్రకటన

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో యూరియా సమృద్ధిగా ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అసెంబ్లీలో వెల్లడించారు. డిసెంబర్ 31 నాటికే 4.04 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా రైతులకు సరఫరా చేసినట్లు మంత్రి తెలిపారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా యూరియా వివరాలు వెల్లడించారు. వేసవిలో 2018 2019 -20 సంవత్సరంలో అక్టోబర్-డిసెంబర్ కాలంలో మొత్తం 2.42 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు

మిగతా 2లో ▸

## నానక్ రామ్ గూడలో ఈగల్ టీం తనిఖీలు

### డ్రగ్స్ తీసుకుంటూ పోలీసులకు చిక్కిన ఏపీ ఎమ్మెల్యే కుమారుడు

పోలీసుల అదుపులో ఎమ్మెల్యే కుమారుడు సుధీర్ రెడ్డి



**హైదరాబాద్, మహా :** హైదరాబాద్‌లో డ్రగ్స్ భూతం మరోసారి పడగ విప్పింది. మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తెలంగాణను మార్చాలన్న ప్రభుత్వ సంకల్పంలో భాగంగా 'ఈగల్ టీమ్' చేపట్టిన ఆకస్మిక దాడుల్లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఐటీ కారిడార్‌గా పేరు గాంచిన నానక్‌రామ్‌గూడ ప్రాంతంలో డ్రగ్స్ వినియోగిస్తున్న ముఠాను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ముఠాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎమ్మెల్యే కుమారుడు ఉండటం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

మిగతా 2లో ▸

## మావోయిస్టు అగ్రనేత దేవా లొంగుబాటు

గెరిల్లా ఆర్మీ చీఫ్ బడ్సే సూక్కా అలియాస్ దేవతో పాటు 20 మంది లొంగుబాటు

హెలికాప్టర్లను కూల్చేందుకు వాడే సామగ్రి అప్పగింత.. డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,మహా:** మావోయిస్టు అగ్రనేత బర్సే సుక్కా అలియాస్ దేవా, తెలంగాణకు చెందిన రాజిరెడ్డి అతని భార్యతో పాటు 20 మంది సభ్యులు భారీగా ఆయుధాలు, నగదు అప్పగించి తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. నిన్ననే లొంగిపోగా ఆ వివరాలను

మిగతా 2లో ▸

## బంగారం రూ.2 లక్షలు.. వెండి రూ.3 లక్షలు?

**మహా:** ప్రస్తుతం మార్కెట్లో బంగారం, వెండి ధరలు ఇప్పటికే రికార్డు స్థాయిలకు దగ్గరగా ఉన్నాయి. దేశీయ మార్కెట్లో బంగారం 10 గ్రాముల ధర సుమారు రూ.1.35 లక్షల నుంచి రూ.1.40 లక్షల మధ్య ట్రేడవుతోంది. అదే విధంగా వెండి ధర కిలోకు సుమారు రూ.2.3 లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకు ఉంది. ఈ ధరలు గత కొన్ని సంవత్సరాలతో పోలిస్తే చాలా ఎక్కువగా ఉండటంతో పెట్టుబడిదారులు భవిష్యత్ ధరలపై ఆసక్తిని కనబరుస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో బంగారం, వెండిని సురక్షిత పెట్టుబడులుగా భావించే వారి సంఖ్య ఎక్కువవుతోంది. ఈ క్రమంలో 2026 నాటికి బంగారం తులం (10 గ్రాములు) ధర రూ.2 లక్షలకు, వెండి కిలో ధర రూ.3 లక్షలకు చేరుతాయనే ప్రచారాలు మార్కెట్ ను ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ప్రస్తుతం కొందరు ఊహిస్తున్నట్లుగా అత్యధిక స్థాయిలైన రూ.2 లక్షలు, రూ.3 లక్షలను తాకడం మాత్రం అంత సులభం కాదని వారు చెబుతున్నారు. మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా కొనసాగితే 2026 చివరి నాటికి బంగారం 10 గ్రాముల ధర రూ.1.5 లక్షల నుంచి రూ.1.7 లక్షల మధ్య ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అదే విధంగా వెండి ధర కిలోకు రూ.2.3 లక్షల నుంచి రూ.2.6 లక్షల పరిధిలోనే స్థిరపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విశ్లేషిస్తున్నారు.

## ఉత్తమ్ కు డాక్టరేట్ ఇవ్వాల్సిందే అధ్యక్షా

### సభలో సీఎం రేవంత్ ప్రశంసలు

**హైదరాబాద్, మహా:** నీటి వివాదాల అంశం ఎంతో క్లిష్టమైనదని అసెంబ్లీలో చర్చ సందర్భంగా సీఎం రేవంత్ అన్నారు. 'బీఆర్ఎస్ ఆరోపణల నేపథ్యంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కృష్ణా జలాల వివాదంపై చాలా స్టడీ చేశారు. ఈ చదువు ఆయన గతంలోనే చదివితే నాలుగు సార్లు ఐఏఎస్ అయ్యేవారు అధ్యక్షా. ఇప్పటికైనా మీరు రికమండ్ చేసి అంబేడ్కర్ వర్సిటీ నుంచి డాక్టరేట్ ఇప్పించాల్సిందే అధ్యక్షా' అని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.

## కాంగ్రెస్ తో పొత్తుకు విజయ్ సై

**చెన్నై:** ఈ ఏడాది జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో చేతులు కలిపే అవకాశాలున్నాయని నటుడు విజయ్ పార్టీ తమిళగ వెట్రి కళగం సంకేతాలు ఇచ్చింది. టీవీకే జాతీయ ప్రతినిధి ఫెలిక్స్ గెరాల్డ్ మాట్లాడుతూ, లౌకికవాదం, మతత్వానికి వ్యతిరేకంగా చేసే పోరాటం విషయంలో కాంగ్రెస్‌టీవీకే విధానాలు ఒకేలా ఉంటాయని, ఆ పరంగా రెండు పార్టీలు సహజ భాగస్వాములని చెప్పారు. రాహుల్ గాంధీ, తమ నేత విజయ్ మంచి స్నేహితులని తెలిపారు. టీవీకే జాతీయ ప్రతినిధి ఫెలిక్స్ గెరాల్డ్ మాట్లాడుతూ, లౌకికవాదం, మతత్వానికి వ్యతిరేకంగా చేసే పోరాటం విషయంలో కాంగ్రెస్‌టీవీకే విధానాలు ఒకేలా ఉంటాయని, ఆ పరంగా రెండు పార్టీలు సహజ భాగస్వాములని చెప్పారు. రాహుల్ గాంధీ, తమ నేత విజయ్ మంచి స్నేహితులని తెలిపారు. టీవీకే, కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంటే మైనారిటీ, బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా కాపాడుకోవచ్చని అభిప్రాయపడ్డారు.

## నానక్ రామ్ గూడలో ఈగల్ టీం తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

నానక్‌రామ్‌గూడలోని ఒక ప్రాంతంలో కొందరు వ్యక్తులు డ్రగ్స్ పార్టీ చేసుకుంటున్నారన్న పక్కా సమాచారంతో ఈగల్ టీమ్ దాడులు నిర్వహించింది. ఈ తనిఖీల్లో ఏపీకి చెందిన జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుమారుడు సుధీర్ రెడ్డి.. తన స్నేహితులతో కలిసి మాదకద్రవ్యాలు తీసుకుంటూ పోలీసులకు చిక్కారు. తక్షణమే పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా సుధీర్ రెడ్డికి 'పాజిటివ్' అని తేలింది. దీంతో పోలీసులు అతడిని, అతనితో పాటు ఉన్న మరికొందరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. రాష్ట్రంలో డ్రగ్స్ సరఫరా, వినియోగంపై తెలంగాణ ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోంది. ముఖ్యంగా యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న ఈ డ్రగ్స్ సంస్కృతిని తుదముట్టించేందుకు ప్రత్యేక నిఘా విభాగాలను ఏర్పాటు చేసింది. ఈగల్ టీమ్ నిరంతరం నిఘా ఉంచుతూ.. ప్రముఖుల పిల్లలైనా, సామాన్యులైనా చట్టం ముందు అందరూ సమానమే అన్నట్లుగా చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే తాజాగా ఒక ఎమ్మెల్యే కుమారుడు దొరకడం, ప్రభుత్వం ఈ విషయంలో ఎంత నిబద్ధతతో ఉందో చాటి చెబుతోంది. ప్రస్తుతం పోలీసులు సుధీర్ రెడ్డిని, ఇతర నిందితులను విచారిస్తున్నారు. వీరికి డ్రగ్స్ ఎక్కడి నుండి సరఫరా అయ్యాయి? ఈ ముఠా వెనుక ఉన్న పెద్ద తలకాయలు ఎవరు? అన్న కోణంలో లోతైన దర్యాప్తు జరుగుతోంది. నగరంలో ఇలాంటి పార్టీలు నిర్వహించే వారిపై, డ్రగ్స్ పెడ్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ ఘటనతో నగరంలోని ఐటీ జోన్లలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఎంతటి వారైనా సరే డ్రగ్స్ కేసులో దొరికితే వదిలే ప్రసక్తే లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# పవన సుతుడి సేవలో పవర్ స్టార్









(మొదటిపేజీ తరువాయి)

ప్రధాన స్థానాచార్యులు కపీంద్ర స్వామి పవన్ కళ్యాణ్ ను సంప్రదాయబద్ధంగా ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం శ్రీ ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి ఇరువైపులా ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీ అమ్మవార్లకు అర్చనలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు పవన్ కళ్యాణ్ కు వేదాశీర్వచనాలు అందించి, స్వామి వారి తీర్థ ప్రసాదం అందచేశారు. దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఈవో శ టి. శ్రీకాంతరావులు స్వామి వారి చితపటాన్ని బహూకరించారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం టిటిడి సహకారంతో 35.19కోట్లతో చేపట్టనున్న దీక్ష విరమణ మండపం అలాగే 96 వసతి సముదాయ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఆంజనేయ స్వామి తమ ఇంటి ఇలవేల్పు అని ఆయన దయతోనే తనకు పునర్జన్మ లభించిందని తెలిపారు. ఆంజనేయ స్వామి అంటే ఎంతో ఇష్టమని పేర్కొన్నారు. గతంలో ఆలయ అధికారులు తన దృష్టికి తీసుకు వచ్చిన వెంటనే అభివృద్ధి పనులకు మాట ఇచ్చినట్లు తెలిపారు. కొండగట్టు ఆంజనేయ స్వామి దయతో రెండు తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ మాస్టర్ ప్లాన్ అమలుకు శ్రీకారం చుట్టడం హర్షనీయమన్నారు. కొండగట్టు గిరి ప్రదక్షణకు మార్గం సుగమం చేసేందుకు అవసరమైతే తానే స్వయంగా కర సేవకుడిని అవుతానని మాట ఇచ్చారు. తానే ముందుండి గిరిప్రదక్షణకు అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని పేర్కొన్నారు. కొండగట్టు గిరి ప్రదక్షణకు మహత్తర శక్తి ఉందని తెలంగాణ రక్షణ దేశ రక్షణకు ఎంతో దోహద పడుతుందన్నారు. గిరి ప్రదక్షణకు అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. రామ భక్తులు పూనుకుంటే సాధ్యం కానిది ఏది ఉండదని స్పష్టం చేశారు. అపజయమే ఉండదని ఆంజనేయస్వామి అలాంటి మహిమ గల స్వామి అని పేర్కొన్నారు. భవిష్యత్తులో సైతం ఆలయ అభివృద్ధికి తాను అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కొండగట్టు ఆలయ అభివృద్ధిలో తనకు సేవ చేసే భాగ్యం కలగడం అదృష్టం అని ఆనందం వ్యక్తం చేశారు. భగవంతుడికి సేవ చేయడం అంటే ఎంతో గొప్ప అదృష్టం ఉండాలన్నారు. కొండగట్టు ఆంజనేయ స్వామికి నిధులు కేటాయించినందుకు ఏపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కు టిటిడి చైర్మన్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు కొండగట్టు అంజన్న స్వామి అజ్ఞ వల్లే ...అందుకే టిటిడి మంచి ఆమోదం లభించిందని తెలిపారు. కొండగట్టు అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ అమలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడం హర్షనీయమన్నారు కొండగట్టు ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఘనంగా స్వాగతం తెలిపిన రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గిరిప్రదిక్షణ తెలుగు రాష్ట్రాలకి, దేశానికి రక్షణగా నిలుస్తుందని, కొండగట్టు గిరి ప్రదిక్షణకి అందరం కలిసి కర సేవా చేద్దామని సూచించారు. అలాగే కొండగట్టు ఆలయ అభివృద్ధికి అందరు కలిసి కట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తన అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**ఎమ్మెల్యే మేడిపల్లి పై పవన్ కళ్యాణ్ ప్రశంసల జల్లు..**

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పై పవన్ కళ్యాణ్ ప్రశంసల జల్లు కురిపించారు. ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడిగా పనిచేసిన కాలంలోనే మేడిపల్లి సత్యం తెలుసని అన్నారు. మా మధ్య 2007 నుంచి స్నేహబంధం కొనసాగుతున్నదని తెలిపారు. యువజన విభాగంలో కలిసిమెలిసి పని చేశామని ఆయన సమాజం పట్ల ప్రజల పట్ల ఎంతో అభిమానం కలిగిన గొప్ప నాయకుడు అని ప్రశంసించారు. స్టూడెంట్ లీడర్ గా రాజకీయాల్లోకి వచ్చి మంచి పేరు సంపాదించుకున్నారని కితాబు అందించారు. ఎప్పటికైనా ఇలాంటి లీడర్లు గొప్పగా ఎదగాలని ఆలోచించానని తెలిపారు. గతంలో కొండగట్టు పర్యటన సందర్భంగా తనకు విద్యుత్ ప్రమాదం జరిగిందనీ ప్రమాదం నుంచి కొండగట్టు అంజన్న దయ వల్ల బయటపడ్డానని తెలిపారు. దీనికి ప్రత్యక్ష సాక్షి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యమేనని ఉద్ఘాటించారు. అదృష్టవశాత్తు కొండగట్టు ఆంజనేయ స్వామి సేవ చేసే భాగ్యం కలగడం అందులోనూ తన మిత్రుడు చొప్పదండి ఎమ్మెల్యేగా ఉండడం ఎంతో అభినందనీయమని ఆనందం వ్యక్తం చేశారు. మేడిపల్లి సత్యం మంచి గొప్ప గుణం ఉన్న లీడర్ అని ప్రశంసించారు.

**ఆలయ అభివృద్ధికి పవన్ కళ్యాణ్ చొరవ అభినందనీయం:అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

ఉత్తర తెలంగాణ పుణ్యక్షేత్రాల్లో ప్రధానమైన కొండగట్టు ఆంజనేయ స్వామి అలయ అభివృద్ధికి ఏపి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవచూపడం అభినందనీయం. 35.19 కోట్లతో దీక్ష విరమణ మండపం 96 గదుల వసతి సముదాయానికి టిటిడి నిధులు మంజూరు చేయించడం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొండగట్టు ఆంజనేయ స్వామి అలయం అభివృద్ధి చేసేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని తెలిపారు. కొండగట్టు ఆంజనేయ స్వామి దీక్ష విరమణ, దర్శనం కోసం వచ్చే భక్తులకు గదుల వసతి సముదాయానికి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం అదృష్టమని చెప్పారు. భవిష్యత్తులో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ద్వారా నిధులు కేటాయించి కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం తిరుమల తిరుపతి దేవస్థానం లాగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. 35.19 కోట్లతో దీక్ష విరమణ మండపం 96 గదుల వసతి సముదాయానికి టిటిడి నిధులు సమకూర్చడానికి తోడ్పడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

**నేటి తరానికి స్ఫూర్తి ప్రధాత పవన్ కళ్యాణ్..**

నేటి తరానికి ప్రజలకు స్ఫూర్తి ప్రదాత ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. కొండగట్టు అంజన్న ఆలయ అభివృద్ధిలో ఆయన భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొండగట్టు ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఇందులో భాగంగానే మాస్టర్ ప్లాన్ అమలు చేసేందుకు కంకణం కట్టుకున్నారని తెలిపారు. కొండగట్టు సందర్శించిన సమయంలో పవన్ కళ్యాణ్ ప్రమాదం బారి నుంచి ఆంజనేయస్వామి దయ వల్ల బయటపడ్డారని తెలిపారు. తాను ప్రత్యక్షంగా ఆ ఘటనను చూసి అవక్కయానని అంజన్న దయవల్ల పవన్ కళ్యాణ్ కు పునర్జన్మ లభించిందని తెలిపారు. పవన్ కళ్యాణ్ కామన్ మ్యాన్ ప్రొటెక్షన్ ఫోర్స్ పేరిట ప్రజలకు సేవలు అందించి మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. అనేక ఏళ్లుగా మా మధ్య స్నేహం కొనసాగుతుందని ఈ తరానికి ఆయన స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారని ఆనందం వ్యక్తం చేశారు. టీటీడీ బోర్డు మెంబర్ శ్రీ బి.ఆనందసాయి, తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ సలహదారు గోవింద్ హరే, జనసేన ప్రధాన కార్యదర్శి శ్రీ రామ్ తాళ్లూరి, శ్రీ ఆర్ కె సాగర్ తదితరులు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

**కొండంత అభిమానం..**

కొండగట్టు పర్యటనకు ఏపీ డిప్యూటీ సీఎం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ రాకతో కొండంత అభిమానం వెల్లువెత్తింది. కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి కాక వరంగల్ అదిలాబాద్ నుంచి పెద్ద సంఖ్యలో అభిమానులు ఆత్మీయులు తరలివచ్చారు. తమ అభిమాన నాయకుడు పవర్ స్టార్ ను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పవన్ కళ్యాణ్ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన అనంతరం తన వాహనంపై కూర్చుని అభిమానులకు అభివాదం తెలిపారు. వేలాదిమంది అభిమానులు రావడంతో కొండగట్టు కిటకిటలాడింది అభిమానులతో. కొండంత అభిమానం పవన్ కళ్యాణ్ పట్ల వెల్లువెత్తింది. పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు. పవన్ కళ్యాణ్ కొండగట్టు పర్యటన అనంతరం అనంతరం సమీపంలోని రిసార్టుకు వెళ్లి జనసేన ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం తిరిగి హైదరాబాదుకు వెళ్ళిపోయారు.

## యూరియా ఫుల్

(మొదటిపేజీ తరువాయి)

నమోదు అవ్వగా, 2020-21 సంవత్సరంలో యాసంగిలో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు కేవలం 1.22 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు మాత్రమే జరిగినట్లు మంత్రి తెలిపారు. 2021-22 సంవత్సరంలో యాసంగి సీజన్‌లో డిసెంబర్ నాటికి 1.75 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరిగితే, 2022-23 సంవత్సరంలో అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో కలిపి మొత్తం 2.63 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరిగాయన్నారు తుమ్మల. 2023-24 సంవత్సరంలో యాసంగి సీజన్‌లో డిసెంబర్ నాటికి 2.17 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు నమోదయ్యాయని, 2024-25 సంవత్సరంలో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు మొత్తం 3.04 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరిగినట్లు పేర్కొన్నారు.

ప్రస్తుత 2025-26 యాసంగి సీజన్‌లో అక్టోబర్ నుంచి డిసెంబర్ 31 వరకు మొత్తం 4.04 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరిగాయన్నారు. ఇది గత 8 సంవత్సరాల్లో అత్యధికం. వేసవిలో డిసెంబర్ వరకూ కేంద్ర కేటాయింపులు 5.60 లక్షల మెట్రిక్ టన్నులకు, ఇప్పటికే 5.78 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను తెప్పించుకోగలిగామని తెలిపారు. రైతులకు అవసరమైనంత వరకూ యూరియా సరఫరా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న 12000 సెంటర్లలో, ఎక్కడో 2,3 సెంటర్లలో ఉన్న క్యూలైన్లు చూపించి రాజకీయ పబ్బం గడపాలని అనుకుంటున్నారని, ఆతృతతో రైతులు అక్కడక్కడ షాప్ ల ముందూ నిల్చున్న సందర్భాలను చూపి యూరియా కొరత అని ప్రచారం చేసి మీ రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలని అనుకుంటే రైతులు క్షమించబోరని అన్నారు మంత్రి. గత ప్రభుత్వ హయాంలో ఉన్న క్యూల సంగతి, ఆ క్యూలలో రైతులు మరణించిన సందర్భాల గురించి నేను మాట్లాడదల్చుకోలేదన్నారు.

ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కపాస్ కిసాన్ యాప్ రాష్ట్రంలో కూడా అమలు చేసామన్నారు. ఆ యాప్ ను ఉపయోగించిన పత్తి రైతులలో సన్న, చిన్నకారు రైతులే ఎక్కువగా ఈ యాప్ ని వినియోగించి పత్తి అమ్మకాలు చేస్తున్నట్లు తెలిపారు. యూరియా యాప్ ను రాష్ట్రంలో 5 జిల్లాలలో ప్రయోగాత్మకంగా చేపట్టడం జరిగిందని, యాప్ మీద కూడా లేని పోని అపోహలు, గందరగోళం సృష్టించే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమన్నారు. ఈ యాప్ ను తీసుకొచ్చే ముందు రైతులందరికీ అవగాహన కల్పించినట్లు తెలిపారు. రిటైల్ అవుట్ లెట్ దగ్గర ఒక వాలంటీర్ ను



ఉంచడం జరిగిందని, ఈ యాప్ ప్రయోగాత్మక దశలో ఏర్పడుతున్న సాంకేతిక సమస్యలన్నింటినీ ఒక్కొక్కటిగా పరిష్కరించినట్లు తెలిపారు. కౌలు రైతులకు, పట్టాలు లేని రైతులకు ఇబ్బంది కలగకుండా చూసుకున్నాం నేను స్వయంగా రైతు వేదికల ద్వారా ఆయా జిల్లాల రైతులతో మాట్లాడితే వారు సంతృప్తి వ్యక్తం చేశారని మంత్రి అన్నారు. యాప్ ద్వారా డిసెంబర్ 20వ తేది నుండి ఇప్పటివరకు 1.18 లక్షల మంది రైతులు 3.36 లక్షల యూరియా బస్తాలు కొనుగోలు చేశారని శాసన మండలిలో తెలిపారు.

## మావోయిస్టు అగ్రనేత దేవా లొంగుబాటు

### గెరిల్లా ఆర్మీ చీఫ్ బడ్సే సూక్కా అలియాస్ దేవతో పాటు 20 మంది లొంగుబాటు

### హెలికాప్టర్లను కూల్చేందుకు వాడే సామగ్రి అప్పగింత.. డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి

(మొదటిపేజీ తరువాయి)

డీజీపీ శనివారం మీడియాకు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే డీజీపీ శివధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, మావోయిస్టు పార్టీ గెరిల్లా ఆర్మీ చీఫ్‌గా దేవా పని చేస్తున్నారు. లొంగిపోయిన వారి నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలను, రూ.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. హెలికాప్టర్లను కూల్చేందుకు వాడే సామగ్రి కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ లొంగుబాటు పీఎల్‌జీఏకు భారీ దెబ్బగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

**హిడ్మా సొంత గ్రామమే**

దేవా హిడ్మా సొంత గ్రామానికి చెందిన వాడు. అయితే ఎన్ఐఏ నుంచి దేవాపై రూ.75 లక్షల రివార్డు ఉందని డీజీపీ తెలిపారు. ఆవులం సోమా, భేమే, వేముల రాజు, మంకు, సుశీల, నందయ్యా, అండా, తెలంగాణ స్టేట్ కమిటీ సభ్యురాలు అడ్లూరి ఈశ్వరి లొంగిపోయినవారిలో ఉన్నారని ఆయన అన్నారు. వారి వద్ద 2 ఎల్ఎమ్‌జీ, యూఎస్ఏ తయారీ కోల్ట్ ఆయుధంతో వచ్చారని తెలిపారు. కాగా ఇజ్రాయెల్ దేశంలో తయారు చేసిన టవర్ ఆయుధం కూడా వీరి వద్ద ఉందని వెల్లడించారు. దీనితో పాటు ఎనిమిది ఏకే 47 గన్‌లు అప్పగించారన్నారు. ఎస్ఎల్ఆర్ 8, నాలుగు బ్యారెల్ గ్రైనెడ్ లాంచర్స్ ఆయుధాలను, హెలికాప్టర్‌ను సైతం కూల్చే భారీ ఆయుధం వీరి వద్ద ఉన్నాయని వాటిని కూడా స్వాధీనం చేసుకున్నట్లు డీజీపీ పేర్కొన్నారు.

**ఇంకా 66మంది మాత్రమే మిగిలారు**

పీఎల్‌జీఏ బెటాలియన్‌లో 400 మంది సభ్యులు ఉండగా ప్రస్తుతం 66 మంది మాత్రమే మిగిలారని డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడించారు. పీఎల్‌జీఏ ప్రస్తుతం పూర్తిగా క్షీణించిందని పేర్కొన్నారు. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా కిష్టంపేట్‌కు చెందిన రాజిరెడ్డి లొంగుబాటుతో ఇంకా రాష్ట్రానికి చెందిన ఒక్కరు మాత్రమే స్టేట్ కమిటీలో ఉన్నారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పిలుపుతో మావోయిస్టులు ఆత్మ సమర్పణ చేసుకున్నారని చెప్పారు. డివిజన్ సభ్యులకు రూ.5 లక్షలు, ఏరియా సభ్యులకు రూ.4 లక్షలు, మిగతా సభ్యులకు రూ. లక్ష రివార్డు ఉందని డీజీపీ పేర్కొన్నారు. రూ.1.80 కోట్ల రివార్డు లొంగిపోయిన మావోయిస్టులకు అందిస్తామని అన్నారు. వారికి తక్షణ సాయం కింద ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున ఇస్తామని వెల్లడించారు. ఇప్పటి వరకు తెలంగాణలో 576 మంది మావోయిస్టులు లొంగిపోయారని తెలిపారు. పీఎల్‌జీఏ సమాచారం ప్రకారం ప్రస్తుతం తెలంగాణ నుంచి 17 మంది సభ్యులు మిగిలి ఉన్నారని చెప్పారు. మిగిలిన మావోయిస్టులు కూడా వీలైనంత త్వరగా లొంగిపోవాలని డీజీపీ

## కృష్ణా జలాల్లో.. తెలంగాణకు ద్రోహం చేసింది కేసీఆరే

(మొదటిపేజీ తరువాయి)

వాటికి విలువ ఉంటుందన్నారు. రెండేళ్లుగా ప్రతిపక్ష నాయకుడు సభకు రాకపోవటం విచారకరమని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ నేతలు అవమానించినప్పటికీ కాంగ్రెస్ నేతలు సభకు వచ్చి మాట్లాడేవారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ప్రతిపక్ష నేతలు అసెంబ్లీలో మాట్లాడకుంటే అంతిమంగా ప్రజలకే అన్యాయం జరుగుతుందని వివరించారు. ప్రభుత్వం తోలు తీస్తామన్న కేసీఆర్.. సభకు రాకుండా ఎక్కడికి పోయారని నిలదీశారు. ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ సభకు రావాలని మేం పదే పదే విజ్ఞప్తి చేశామని గుర్తు చేశారు. కేసీఆర్ సభకు రాకపోవడానికి కారణాలేమి లేవని.. ఈసారి సభలో కూడా ఆయనపై అనుచిత వ్యాఖ్యలు కూడా ఎవరు చేయలేదన్నారు. ఎలాంటి కారణం లేకుండా సభను బాయ్ కాట్ చేయడంతో చట్టసభల పట్ల బీఆర్ఎస్‌కు ఉన్న చిన్న చూపు మరోసారి బయటపడిందని విమర్శించారు.

**చర్చను తెరపైకి తీసుకువచ్చిందే కేసీఆర్**

కృష్ణా జలాల అంశంపై చర్చను తెరపైకి తీసుకువచ్చిందే కేసీఆర్ అని రేవంత్ రెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయాల్లో మాట్లాడితే ప్రజల్లో గందరగోళం నెలకొంటుందన్నారు. అందుకే కేసీఆర్ మాట్లాడగానే తాము అసెంబ్లీ సమావేశాలు నిర్వహించామన్నారు. రాష్ట్ర నీటి హక్కులను కాపాడేందుకు ప్రజలు ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చేశారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. కృష్ణా జలాల్లో ట్రైబ్యునల్ ఏర్పడి ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీలు కేటాయించిందన్నారు. బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ తీర్పుపై 2010 నుంచి పంచాయతీ ఇంకా కొనసాగుతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇపుడు కర్ణాటక ప్రభుత్వం మళ్లీ ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచేందుకు సిద్ధమైందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు కలిసి కర్ణాటకపై పోరాడాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మన మధ్య(ఏపీ, తెలంగాణ) పంచాయతీలు ఉన్నప్పటికీ కలిసిమెలిసి కర్ణాటకపై పోరాడాలని అన్నారు. అన్నదమ్ముల మధ్య విభేదాలు ఉన్నప్పటికీ బయటి శత్రువు వస్తే కలిసి పోరాడాలన్నారు. ఉమ్మడి ఏపీలోనే మక్తల్ నారాయణపూర్ ఎత్తిపోతలకు జీవో జారీ అయ్యిందని గుర్తుచేశారు. రాష్ట్రం విడిపోయే ముందు జారీ అయిన చివరి జీవో మక్తల్ నారాయణపూర్ ఎత్తిపోతలకు సంబంధించిందేనన్నారు.

**కేసీఆర్ తెలంగాణకు మరణశాసనం రాశారు**

ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన మక్తల్ నారాయణపూర్ ప్రాజెక్టు పదేళ్లపాటు నిర్లక్ష్యానికి గురైందని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఏపీలో తెలంగాణ ప్రాజెక్టుల కోసం 490 టీఎంసీలు కేటాయించారని గుర్తుచేశారు. కృష్ణా బేసిన్‌లోనే తెలంగాణ ప్రాజెక్టులకు 490 టీఎంసీల కేటాయింపు ఉండేదని, రాష్ట్రం విడిపోయే ముందు కిరణ్‌కుమార్ ప్రభుత్వం 299 టీఎంసీలు అని పేర్కొన్నదని వివరించారు. ఆనాడు ఈఎన్‌సీగా ఉన్న మురళీధర్‌రావు 299 టీఎంసీలు అని తప్పుడు నివేదిక ఇచ్చారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. 490 టీఎంసీల కోసం పోరాడాల్సిన కేసీఆర్ 299 టీఎంసీలకు ఒప్పుకుంటూ సంతకం చేశారని విమర్శించారు. 490 టీఎంసీల కోసం పోరాడాల్సిన కేసీఆర్ 299 టీఎంసీలకు ఒప్పుకుంటూ సంతకం చేశారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్, హరీశ్‌రావు 299 టీఎంసీలకు ఒప్పుకుంటూ తెలంగాణకు మరణశాసనం రాశారని ఆక్షేపించారు.



### కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఉన్నటువంటి పథకాలు తెలుసుకొని

# గ్రామ ప్రజలు అభివృద్ధిలోకి రావాలి

**సూర్యాపేట జిల్లా లీగల్ సర్వీసెస్ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి రజిత గోపు**




**సూర్యాపేట జిల్లా మహా** సూర్యాపేట జిల్లా చివ్వెంలా మండలం పాండ్యనాయక్ తండాలో శనివారం సూర్యాపేట జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ,ఎన్ ఏ ఎల్ ఎస్ ఏ (పేదరిక నిర్మూలన పథకాల ప్రభావ వంతమైన అమలు) పథకం, 2015పై చట్టపరమైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి రజిత గోపు గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ అవగాహన సదస్సు ముఖ్య ఉద్దేశం ప్రజలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఉన్నటువంటి పథకాలు తెలుసుకొని గ్రామ ప్రజలు అభివృద్ధిలోకి రావాలని అదేవిధంగా ఏదైనా సమస్య వారికి వస్తే కోర్టు పోలీస్ స్టేషన్ అనకుండా గ్రామంలోనే కూర్చొని పరిష్కరించుకోవాలని తల్లి దండ్రుల కష్టాన్ని పిల్లలకు తెలియజేయాలని లేనిచో వారు బాధ్యతారహిత్యంగా వ్యవహరిస్తారని మరియు డిఎల్ఎస్సి ద్వారా ఉచిత న్యాయ సహాయం అందించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొంపల్లి లింగయ్య, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ/చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సుంకరబోయిన రాజు, డి.ఎల్.ఎస్.ఎ నామినేటెడ్ మెంబర్స్ గుంటూరు మధు,డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ బొల్లెద్దు వెంకటరత్నం,గ్రామ సర్పంచ్ ధారావత్ భద్రమ్మ హనుమ పంచాయతీ సెక్రెటరీ జి.మంగమ్మ , సోషల్ వెల్ఫేర్ కే.లత పి.ఎల్.వి డి .కృష్ణ జి. వెంకన్న తదితరులు పాల్గొన్నారు

### సమాజంలో ఉన్న విషమ పరిస్థితుల నుంచి ప్రపంచానికి వెలుగులను

# చూపించిన ధీరవనిత సావిత్రి బాయి పూలె

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



సూర్యాపేట జిల్లా సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని సమావేశం మందిరంలో శనివారం సావిత్రిబాయి పూలే 195వ జన్మదినోత్సవ సందర్భంగా నిర్వహించిన మహిళా ఉపాధ్యాయ దినోత్సవం లో ముఖ్యఅతిథిగా సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్ పాల్గొని చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు చదువుకోవటం ద్వారా నేడు ఆటలలో రాణించటం తో పాటు,ప్రభుత్వ ఉద్యోగులుగా,ఐ ఏ ఎస్, ఐ పి ఎస్ లుగా అవ్వటంతో పాటు అంతరిక్షంలోకి వెళ్లేలా తయారయ్యారని సమాజంలో పెను మార్పులు సృష్టించేలా నేడు మహిళలు ఉన్నత స్థానాలకి ఎదిగి మహిళా సాధికారత వైపు అడుగులు వేస్తున్నారని తెలిపారు.చదువుకోవటం ద్వారా వ్యక్తులు స్వతంత్రంగా జీవించేలా చేయటం తో పాటు, సమాజం లో స్థిర మార్పులు తీసుకొస్తుందని మహాత్మా జ్యోతి బాపూలే సావిత్రిబాయి పూలేకు స్వయంగా విద్యను నేర్పించి దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా తీర్చిదిద్దాడని అన్నారు సావిత్రిబాయి పూలే నాటి సామాజిక పరిస్థితులను అధిగమించి మహిళలకు ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేసి చదువు నేర్పించి ఎందరో మహిళలను ఉన్నత స్థానాలకు చేర్చిందని నేను కూడా సావిత్రిబాయి పూలే యూనివర్సిటీ పూణే నందు డిగ్రీ విద్యను అభ్యసించానని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు జిల్లాలో ఉపాధ్యాయు లు సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగిస్తూ విద్యార్థులకు జ్ఞాన దీపాలను వెలిగించి మారుతున్న సాంకేతిక యుగంలో ప్రపంచ స్థాయికి పోటీపడేలా తయారు చేసి ఉన్నత స్థానాలకు చేరుకునేలా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.

**సమాజంలో మార్పులు తెచ్చేలా భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలి**

మహిళలకు ఓపిక,సహనం ఎక్కువగా ఉంటుందని మహిళలు అని రంగాల్లో రాణిస్తూ సావిత్రిబాయి పూలే చూపిన మార్గంలో ప్రయాణిస్తూ విద్యార్థులు సరైన మార్గంలో క్రమశిక్షణతో ప్రవర్తించేలా సమాజంలో మార్పులు తెచ్చేలా భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని జిల్లా ఎస్పీ కే నరసింహ సూచించారు.

**పూలే జీవిత చరిత్రను తెలుసుకొని ఆమెను అనుసరించాల్సిన అవసరం ఉంది**

అదనపు కలెక్టర్ కె సీతారామారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రను తెలుసుకొని ఆమెను అనుసరించాల్సిన అవసరం ఉందని అన్నారు. సావిత్రిబాయి పూలే మొదట చదువుకోలేదని,10 సంవత్సరాలకే బాల్య వివాహం చేశారని,మహాత్మ జ్యోతిరావు బాపులే ఆమెకు అక్షర జ్ఞానం నేర్పించి దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దారని తెలిపారు.ఒక వ్యక్తికి చదువు నేర్పితే వెయ్యి మంది జీవితాలు వెలుగునివ్వచ్చని సావిత్రిబాయి పూలే నాటి పరిస్థితులను ఉక్కుసంకల్పంతో ఎదుర్కొని ముందుకెళ్లిందని ఆమెను స్ఫూర్తిగా తీసుకొని నేటి ఉపాధ్యాయులు ప్రభుత్వ బడులను బలోపేతం చేసి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ప్రతిభ చూపెట్టిన జడ్.పి.హెచ్.ఎస్ ఏనుబాముల ఉపాధ్యాయురాలు పి ఝాన్సీ, జెడ్పిహెచ్ఎస్ చివ్వేంల ఉపాధ్యాయురాలు జె రమణ, పాలే అన్నారం ఎం పి పి ఎస్ ఉపాధ్యాయురాలు కవిత, మఠంపల్లి ఎంపీపీ ఎస్ ఉపాధ్యాయురాలు రాధమ్మ, జడ్పీహెచ్ఎస్ తెల్లబెల్లి ఉపాధ్యాయురాలు పద్మావతి, జడ్.పి.హెచ్.ఎస్ కోదాడ ఉపాధ్యాయురాలు పద్మావతి, ఎంపీపీ ఎస్ ఉపాధ్యాయులు వెంకటరమణ, కేజీబీవీ పెన్పహాడ్ ఆసియా జబీన్, కేజీబీవీ నూతనకల్ ఉపాధ్యాయురాలు హారిక, టీజీ ఎంఎస్ గడ్డిపల్లి శాంతి ప్రియలను ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి డి ఎస్ పి ప్రసన్న కుమార్,డీఈఓ అశోక్ బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహారావు డిటిడిఓ శంకర్ జి సి డి ఓ పూలన్,ఏ ఓ సుదర్శన్ రెడ్డి,సంఘ నాయకులు బంటు కృష్ణ, టీ హుస్సేన్, సిహెచ్ నరసింహ,యన్ వెంకట్, సత్యనారాయణ, మహిళా ఉపాధ్యాయులు తదితరులు హాజరైనారు.

## టిఆర్పి పార్టీ కార్యాలయంలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



**సూర్యాపేట జిల్లా మహా:** సావిత్రి బాయి పూలె జయంతి సందర్భంగా సావిత్రి బాయి పూలె చిత్రపటానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి ఆమె సేవలను స్మరించుకున్నారు .ఈ సందర్భంగా వట్టె జానయ్య యాదవ్ మాట్లాడుతూ,భారతదేశంలో మహిళా విద్యకు బాటలు వేసిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలె అని, సామాజిక వివక్ష, లింగ అసమానతలకు ఎదురొడ్డి విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని నిరూపించిన గొప్ప మహనీయురాలన్నారు. ఆడపిల్లల విద్య కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.వెనుకబడిన వర్గాలు, మహిళలు, దళితుల అభ్యున్నతికి ఆమె చేసిన సేవలు మరువలేనివని, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి సామాజిక కార్యకర్త, రాజకీయ నాయకుడి బాధ్యత అని వట్టె జానయ్య యాదవ్ గారు తెలిపారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ కూడా సావిత్రి బాయి పూలె ఆశయాలకు అనుగుణంగా సమానత్వం, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టి అర్ పి మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రేసిడెంట్ నీరజ గౌడ్, జిల్లా అధ్యక్షుడు మామిడి అంజయ్య,ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్,పట్టణ అధ్యక్షుడు కుంభం నాగరాజు,ఆత్మకూరు (ఎస్)మండల పార్టీ అధ్యక్షుడు బొల్లె సైదులు, యువజన విభాగం అధ్యక్షుడు కోల కరుణాకర్ ముదిరాజ్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఏశబోయిన మల్లేష్, బొమ్మగాని సైదులు,పగిళ్ల శరత్, లింగాల సైదులు,సేవ్యా నాయక్, కొన్నె మంజుల, నారాయణదాసు,కవిత కడియం వంశీ మహేష్,పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సావిత్రి బాయి పూలెకు ఘన నివాళులు అర్పించారు. ఆమె జయంతి సందర్భంగా విద్య, సమానత్వం, సామాజిక చైతన్యం పట్ల మరింత కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

# హలో కామ్రేడ్ ఛలో ఖమ్మం...



సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కార్యకర్తలకు పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా కంభం పట్టణంలో ఈ నెల 18వ తేదీన జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని 3,4 తేదీలలో నియోజకవర్గంలోని సిపిఐ ఆధ్వర్యంలో జీపు ప్రచార జాత సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు,నియోజకవర్గ ఇన్చార్జి కే రామస్వామి అధ్యక్షతన ఈరోజుచేవెళ్ల కేంద్రంలోని శంకర్పల్లి చౌరస్తాలో జీపు జాతను సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగన్న ముఖ్యఅతిథిగా విచ్చేసి జెండాను ఊపి ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ... దేశంలో భారత గడ్డపై సిపిఐ పార్టీకి 100 సంవత్సరాలు పూర్తి అయినాయని, కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల సుదీర్ఘకాలం అనేక పోరాటాలు ఎన్నో ఉద్యమాలు ఎన్నో త్యాగాలు ఎంతోమంది బలిదానాలు చేసిన పార్టీ ఎర్రజెండా అని, బడుగు బలహీన వర్గాల కోసం కార్మికుల కోసం కర్షకుల కోసం ఎండిన డొక్కల కోసం రైతాంగం కోసం కార్మికుల హక్కుల కోసం సామాజిక న్యాయం సమాన హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన జెండా ఎర్రజెండా అని కొనియాడారు. పార్టీలు వస్తుంటాయి పోతుంటాయి అధికారం ఉన్న లేకున్నా కానీ కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల సుదీర్ఘమైన చరిత్ర అని వారు తెలిపారు. జీపు జాత చేవెళ్ల నియోజవర్గం అన్ని ప్రాంతాలు తిరుగుతూ ఈనెల 18న జరిగే ఖమ్మంలో భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాల నుంచి కమ్యూనిస్టు శాఖల నుంచి కార్యకర్తలు కార్మికులు కర్షకులు రైతులు శ్రేయోభిలాషులు వామపక్ష భావాల గల కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ బహిరంగ సభను విజయవంతం చేయాలని, ఈ మాసభ 5 లక్షల మందితో జరిగే మాసభకు దేశ నలుమూలల నుండే కాకుండా 42 దేశాల సార్థక ప్రతినిధులు పాల్గొన్నారు ఈ బహిరంగ సభను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం ప్రభు లింగం, జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ, మహిళా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట వడ్ల మంజుల, అంతారం వార్డ్ నెంబర్ జయమ్మ, ఏఐకేఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏం సుధాకర్ గౌడ్, ఒగ్గు సత్యనారాయణ, సాయిలు, పోచయ్య, శ్రీను, మహేందర్, పెంటయ్య, లలిత, యాదమ్మ, భాగ్యమ్మ, సీనియర్ నాయకులు నరసయ్య పాల్గొన్నారు.

## జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు -2026

ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడం ఆర్టీసీ డ్రైవర్ల విధి..

సూర్యాపేట డివిజన్ డిఎస్పీ ప్రసన్న కుమార్



**సూర్యాపేట జిల్లా మహా:** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు 2026 పురస్కరించుకుని శనివారం సూర్యాపేట పట్టణంలో గల ఆర్టీసీ బస్టాండ్ డిపో నందు బస్సు డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలు, ప్రయాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్, సూర్యాపేట రోడ్ ట్రాన్స్పోర్ట్ అధికారులు సంయుక్తంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చాల్సిన బాధ్యత ఆర్టీసీ డ్రైవర్ల పై ఉన్నదని డిఎస్పి తెలిపారు.నిబంధన ప్రకారం వాహనాలను నడపాలని అతివేగంగా వెళ్లకుండా నిదానంగా వెళ్లాలని సూచించారు.ఆర్టీసీ సిబ్బందితో వాహనాలను జాగ్రత్తగా నడుపుతామని ప్రతిజ్ఞ చేయించారు.రోడ్డు ప్రమాదాల నివారించడం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వాహనాలు నిదానంగా నడపాలని, పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని కోరారు, రహదారులపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. రోడ్డు ప్రమాదంలో ఏ ఒక్క వ్యక్తి మరణించకూడదని ఇందుకోసం ప్రతి ఒక్కరు బాధ్యతగా వాహనాలు నడపాలని కోరారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జయప్రకాష్ రెడ్డి,ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జాన్ రెడ్డి, సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం పాల్గొన్నారు.

## వ్యవసాయ విద్యార్థులకు గ్రామీణ కృషి అనుభవం ఎంతో ముఖ్యం



**హుజూర్ నగర్ మహా** గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమం (రావే) లో భాగంగా లయోలా అకాడమీ, హైదరాబాద్ కి చెందిన బియస్సి వ్యవసాయ డిగ్రీ కోర్సు విద్యార్థినులు గ్రామీణ వ్యవసాయ విధానాలు స్థితిగతులను తెలుసుకొని గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ (పి ఆర్ ఏ) కార్యక్రమం ద్వారా అధ్యయనం చేసినట్లు గరిడేపల్లి మండలం గడ్డిపల్లి కె.వి.కె శాస్త్రవేత్త డి ఆదర్శ్ తెలిపారు. గడ్డిపల్లి సొసైటీ నందు నిర్వహించిన గ్రామీణ అవగాహన సదస్సు కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థులు గ్రామస్తులతో సంభాషించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి తెలుసుకొని వాటి పరిష్కార మార్గాలను గ్రామ పటం, వెన్ డయాగ్రమ్, పై చార్ట్, చిత్రాల రూపంలో ప్రదర్శించి గ్రామీణ రైతులకు అవగాహన కల్పించినట్లు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గ్రామం యొక్క వనరులను గ్రామ పటం ద్వారా చిత్రీకరించి మరియు గ్రామంలోని రైతుల వర్గీకరణ, జనాభా భౌగోళికప్రాంతం, నీటి వనరులు, వ్యవసాయ దిగుబడులు, చీడ పీడల నివారణకు ఆచరిస్తున్న యాజమాన్య పద్ధతులు మొదలగు విధానాల అంశాలపై, పైచార్ట్ లో చిత్రీకరించి రైతులకు అవగాహనా కలిపించారు. అదేవిధంగా రైతులు ఎక్కువగా ఒకే పంట పండిస్తున్నారని దాని ద్వారా భూసారం తగ్గి, పంట చీడపీడలు ఎక్కువగా పెరిగి దిగుబడులు తగ్గుతున్నాయని తెలుపుతూ పంట మార్పిడి విధానాన్ని పాటించి దిగుబడులను పొందవచ్చు అన్నారు. రైతులు ఒకే పంట కాకుండా సమగ్ర వ్యవసాయం చేస్తూ సరియైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచిదిగుబడులు పొందవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డి ఆదర్శ్, పి అక్షిత్ సాయి, ఏ కిరణ్, రైతులు కోటయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నరసింహ, సైదులు, భాను, ప్రకాష్, మరియు విద్యార్థినులు శ్రీనిధి, మాధురి, ప్రణతి, బృంద, రష్మీ, ప్రసన్న పాల్గొన్నారు.

### ఉపాధి హక్కును హరించే

# జీరాంజీ చట్టాన్ని రద్దు చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా



**ఆలేరు, మహా:** ఉపాధిని హరించే జీ రాం జీ చట్టాన్ని రద్దు చేసి, 2005 మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆలేరు పట్టణంలోని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో జీ రాం జీ చట్టాన్ని రద్దుచేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని "రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు మండల ప్రధాన కార్యదర్శి జూకంటి పౌల్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించినారు. సమావేశానికి ముఖ్య అతిథిగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి జీ రాం జీ చట్టాన్ని తేవడం గ్రామీణ పేదలకు, వ్యవసాయ కార్మికులకు, కూలీలకు చేసిన ఘోర నమ్మక ద్రోహమని ఇది దేశ ప్రజాస్వామ్య చరిత్రలో మరో చీకటి రోజని అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఎవరో దయ దక్షిణాల మీద రాలేదని అది ప్రజల పోరాటాల ఫలితంగా సాధించుకున్న చట్టబద్ధమైన ఉపాధి హక్కు అని అన్నారు. పని అడిగితే పని ఇవ్వాల్సిందే అనే బాధ్యతను ప్రభుత్వంపై మోపిన చట్టమని అలాంటి హక్కు ఆధారిత చట్టాన్ని మోడీ ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. ఇప్పుడు తీసుకొచ్చిన చట్టం కేంద్ర ప్రభుత్వ ఇష్టానుసారంగా ఇవ్వబడే భిక్షగా మార్చారని ఆవేదన వెలిబుచ్చారు. రెండు రోజులలోనే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు పని పొందే హక్కుగా ఉన్న చట్టాన్ని కార్పోరేట్ శక్తుల కోసం కూల్చివేశారని, పేదల ఉపాధిపై వారి జీవనంపై బీజేపీ ప్రభుత్వం బుల్డోజర్ మోడల్ను అమలు చేసిందని విమర్శించారు. మహాత్మా గాంధీని చంపిన గాడ్సే వారసులే ఈ రోజు గాంధీ పేరుతో ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని కూడా చంపి మతతత్వ రంగును పులమటానికి రాంజీ వచ్చే విధంగా బిల్లును తీసుకొచ్చారని తెలిపారు. నాడు రైతాంగానికి వ్యతిరేకంగా మోడీ తీసుకొచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగ ఉద్యమం ఇచ్చిన స్ఫూర్తితో 2005 మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించడానికి జీ రాంజీ చట్టాన్ని రద్దు కోసం రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, ప్రజా సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్యవాద శక్తులు, అందరూ ఐక్యంగా ఈ పోరాటంలో కలిసి రావాలని నర్సింహ పిలుపునిచ్చారు. ఇంకా ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ రైతు కూలి సంఘం రాష్ట్ర కార్యదర్శి కేమిడి ఉప్పలయ్య , ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు కళ్లెపు అడవయ్య, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు ఎంఏ. ఇక్బాల్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చెక్క రమేష్ , వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు లక్ష్మి , సిఐటియు పట్టణ మండల కన్వీనర్లు మొరిగాడి రమేష్, సంగి రాజు, రైతు సంఘం మండల కార్యదర్శి సుధాగాని సత్య రాజయ్య పాల్గొని మాట్లాడగా ఇంకా మధ్యబోయిన ఉప్పలయ్య, కూరాకుల మల్లికార్జున, చౌడబోయిన యాదగిరి, ఘనగాని మల్లేష్, పోతరాజు నరసయ్య, నెలిగొండ సుధాకర్, బర్ల సిద్ధులు, దండు ఐలయ్య, మాలోతు చింటూ, సాయిని కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 10న చలో సూర్యాపేట

**ప్రఫుల్ రామ్ రెడ్డి టి యు జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు**



A**భువనగిరి, మహా :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులను గుర్తించాలని ఈ నెల 10న సూర్యాపేటలో జరుగు మహాసభను జయప్రదం చేయాలని టి యు జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు ప్రఫుల్ రాంరెడ్డి అన్నారు శనివారం భువనగిరి జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని 250 గజాల ఇంటి స్థలముతో పాటు 25 వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రన్న ప్రసాద్ మోహన్ బైరాగి బాకారం లావణ్య రత్నపురం పద్మ కొండాపురం శ్రీను పొట్ట కిరణ్మో లుగు లక్ష్మయ్య కొండాపురం గణేష్ మట్ట ఆంజనేయులు జహంగీర్ సైదులు శంకరయ్య పాల్గొన్నారు

## సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు సామాజిక సేవలో రాణించాలి

**మహాత్మా గాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి**



**సూర్యపేట జిల్లా మహా** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ సోషల్ సైన్సెస్ మరియు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీదేవి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి మాట్లాడుతూ ఆనాటి సమాజంలో ఉన్న సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి సావిత్రి బాయి పూలే మరియు జ్యోతిబాపూలేలు సత్యశోధక సమాజం ద్వారా నిర్విరామ కృషి చేశారన్నారు. వారి కృషి ఫలితంగానే ఈనాడు అన్ని రంగాలలో స్త్రీలు సమాన అవకాశాలను పొందుతూ సమాజాభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారు. సావిత్రి బాయి పూలే మరియు ఫాతిమా షేక్ లు స్త్రీలు అన్ని రంగాలలో విజయాలు సాధించాలంటే విద్య ఒకటే ప్రధాన మార్గమని నమ్మి చుట్టూ ఉన్న స్త్రీలకు విద్యను నేర్పించారన్నారు. అనేక బాలికల పాఠశాలలు నెలకొల్పి సామాజిక మార్పుకు శ్రీకారం చుట్టారు. విశ్వవిద్యాలయంలో చదువుకునే విద్యార్థులు జాతీయ సేవా పథకంలో చేరి సమాజంలో రుగ్మతలను రూపుమాపడానికి తమ వంతుగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సావిత్రిబాయి పూలే లాంటి సంఘ సంస్కర్తలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులంతా అన్ని రంగాల్లో విజయం సాధించారని ఆకాంక్షించారు. మొదట మనం బాగుపడి తర్వాత మన చుట్టూ ఉన్న సమాజాన్ని బాగు చేసినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలోని జాతీయ సేవా పథకం విద్యార్థులందరికీ సమాన అవకాశాలను అందిస్తుందనీ, వాటిని ఉపయోగించుకొని చదువుతోపాటు సామాజిక స్పృహ ను అలవాటు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న మహిళా అధ్యాపకులకు జాతీయ సేవా పథకం తరపున సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ సైన్స్ సోషల్ సైన్సెస్ జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ మ్యాథరి ఆనంద్, డాక్టర్ మహమ్మద్ షరీఫ్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ రమేష్ నాయక్ మరియు వివిధ శాఖల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మున్సిపాలిటీ ఓటర్ జాబితా తప్పుల తడక

**28 వార్డులలో కూడా అదే పరిస్థితి**




**హుజూర్ నగర్ మహా:** సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని మున్సిపాలిటీ ఓటర్ల జాబితా తడక తయారయింది. కనీసం వార్డ్ బౌండరీస్ కూడా పట్టించుకోకుండా తమకు నచ్చిన వారి వివరాలను నచ్చినట్లుగా ఓటర్ లిస్టు తయారు చేసుకుని గత కౌన్సిలర్లు తమ ఓటు బ్యాంకు ను నిలుపుకునేందుకు వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ గత కౌన్సిలర్లు నాయకులు చెప్పినట్లుగా అధికారులు వింటూ వారు పెట్టిన దరఖాస్తులను విచారణ చేయకుండానే ఓటర్ల జాబితాను తయారు చేస్తున్నారు. ఒక్కొక్క వార్డులో సుమారు 1000 కి పైగా ఓట్లతో ఓటర్ల లిస్టు తయారుచేసి ఒకటవ తారీఖున నోటీస్ బోర్డులపై ప్రచురించడం జరిగింది ఇట్టి 28 వార్డుల లిస్టులలో ఒక్క వార్డు కూడా సక్రమంగా అధికారులు విచారణ జరిపి మున్సిపల్ వార్డ్ బౌండరీల వారీగా తయారుచేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు కనీసం ఓటర్ల వివరాలను ఫోటోలతో సహా ప్రచురించకపోవడం కూడా సమస్యగా మారింది. 28 వార్డులలో ఒక్క వార్డులో కూడా చుట్టుపక్కల వార్డులతో పాటు హుజూర్నగర్ మున్సిపాలిటీ లోని అన్ని వార్డుల ఓట్లు చేరడం, ప్రజల వద్దకు ఓటర్ లిస్ట్ చేరకపోవడంతో వారి ఓటు ఎక్కడుందో కూడా దొరకని పరిస్థితి ఒక వ్యక్తి తన ఓటు దూలాడుకునేందుకు 28 ఓటర్ లిస్ట్ చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది కనీసం మున్సిపాలిటీ అధికారులు తమ ఓటు ఎక్కడుందని చెప్పడానికి కూడా సరైన ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మున్సిపల్ ప్రత్యేక అధికారులు ఎలక్షన్ అధికారులు స్పందించి అన్ని వార్డులు వార్డు బౌండరీస్ ప్రకారం ఇంటింటికి తిరిగి గ్రామంలో నివాసం ఉన్న వారి ఓట్లను సక్రమంగా ప్రచురించేలా చర్యలు తీసుకోవాలని ఓటర్లు కోరుతున్నారు.

## మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలి

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**



**యాదాద్రి భువనగిరి, మహా:** మున్సిపాలిటీలలో వార్డుల వారీగా ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితాను పునః పరిశీలన చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. శనివారం మినీ మీటింగ్ హల్ లో కలెక్టర్, ఎస్పీ ఆకాంక్షశ్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,పోలీస్,మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో ఏలాంటి తప్పులు లేకుండా నూటికి నూరు శాతం పారదర్శకంగా ఉండాలని, అందువల్ల ఈ నెల 1 న మున్సిపల్ వార్డుల వారిగా ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితాను మున్సిపల్ కమిషనర్లు, బి ఎల్ ఓలు, వార్డ్ ఆఫీసర్లు పునః పరిశీలన చేయాలని చెప్పారు. ప్రస్తుతం ప్రచురించిన ఓటరు జాబితా ఈసీఐ ఆదేశాలకు మేరకు తయారు చేయాలన్నారు.ఆయా వార్డుల వారిగా రూపొందించిన ఓటరు జాబితాలో ఓటర్ల వివరాలు ఇంటి నెంబర్ల ప్రకారం ఉన్నాయో లేదో చూడాలన్నారు. ఒక వార్డులోని కుటుంబ సభ్యులు అదే వార్డులో ఉండేలా చూడాలని, ఒక వార్డులో నిర్దేశించిన పరిమితి కంటే ఎక్కువ ఓటర్లు లేకుండా చూడాలని, మున్సిపల్ ఎన్నికల సందర్భంగా గుర్తించిన రిటర్నింగ్ అధికారులు చురుకుగా, పూర్తి అవగాహనతో ఉండేవారిని ఎంపిక చేయాలని అన్నారు. ప్రస్తుతమున్న ఓటరు జాబితాలో ఎట్టి పరిస్థితులలో సవరణకు అవకాశం లేదన్న విషయాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు, ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని ఆయన వెల్లడించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా ముసాయిదా జాబితాను ప్రదర్శించాలని, అభ్యంతరాలను స్వీకరించి సకాలంలో వాటిని పరిష్కరించాలని, జనవరి 10వ తేదీన తుది ఓటరు జాబితా వెలువరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి, సదుపాయాలను పరిశీలించాలని అన్నారు. అవసరమైన చోట కనీస సౌకర్యాలు కల్పించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ర్యాంపు వంటి వసతులు ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఎలక్షన్ పోలీస్ అధికారులు శాంతి భద్రతల విషయంలో షెడ్యూల్ వెలువడిన నాటి నుండి, ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు అనుక్షణం జాగరూకతతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో అడిషనల్ యస్.పి లక్ష్మీనారాయణ, రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

WEEKEND ANALYSIS
వీకెండ్ అనాలసిస్

# అసెంబ్లీలో రేవంత్ చాణక్యం

తెలంగాణ అసెంబ్లీలో కొత్త ముఖచిత్రం. ఒకవైపు పూర్తిగా ప్రిపేర్ అయి వచ్చిన అధికారపక్షం.. మరోవైపు బాయ్‌కాట్ పేరుతో సభను వీడిన ప్రతిపక్షం. నీళ్ళపంచాయతీని మొదలుపెట్టిన బీఆర్ఎస్ సీఎం రేవంత్ రెడ్డి చాణక్యం ముందు తేలిపోయింది. ఎపుడూ నీళ్ళవిషయంలో తమకు మాత్రమే అవగాహన ఉందని, కిందపడ్డా.. నీళ్ళవిషయంలో సర్కారును ఇరకాటంలో పెట్టవచ్చని భావించిన బీఆర్ఎస్ ఎత్తులు పారలేదు. చివరకు ప్రిపేర్ కాలేదని బయటపడాల్సిన పరిస్థితి అధికారపక్షం కల్పించడం కాంగ్రెస్ సర్కారు వ్యూహ విజయమే. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావించాక బిఆర్ఎస్ కు ఇలాంటి పరిస్థితి ఎపుడూ ఎదురుకాలేదు. గత రెండేళ్ళుగా కూడా.. బిఆర్ఎస్ ను కాంగ్రెస్ సభలో ఇంతలా డిఫెన్స్ లో పడేయలేదు. తెలంగాణ రాజకీయాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాధించిన సాధికారితకు, పట్టుకు సభ సాక్షిగా కనిపిస్తోంది. జూబ్లీహిల్స్ విజయం, పంచాయతీ విజయాలు, ఇటీవల కాలంలో పెరిగిన ముఖ్యమంత్రి గ్రాఫ్, ఎత్తుగడలు సొంతపక్షంలో మద్దతు పెంచగా, ఎదుటిపక్ష ఆత్మవిశ్వాసం దెబ్బతీసింది. బిఆర్ఎస్ కు ఎమ్మెల్సీ, కేసీఆర్ కుమార్తె కవిత పెనుసవాల్ గా మారగా, హరీష్ ను ముందుపెట్టి చేసే రాజకీయాన్ని కవిత తునాతునకలు చేస్తోంది. కేసీఆర్ సభకు రాకుంటే బీఆర్ఎస్ కథం అని కవిత ప్రకటించడం పెద్ద స్టేట్ మెంట్. బిఆర్ఎస్ పార్టీకి రెండేళ్ళతర్వాత ఉపనేతలను నియమించినా సభలో మైలేజీని ఆ పార్టీ తీసుకోలేకపోయింది. తెలంగాణోళ్ళ దిష్టి కొబ్బరిచెట్లకు తగిలింది అంటూ వ్యాఖ్యానించి విమర్శల పాలైన జనసేన అధినేత పవన్ కల్యాణ్ నష్టనివారణ చర్యల్లో భాగం టిటిడిని ఒప్పించి కొండగట్టు అంజన్నకు నిధులిప్పించి బ్యాలెన్స్ చేసుకున్నట్లు కనబడుతోంది.


కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

**- తాజా రాజకీయ పరిణామాలపై మహాపత్రిక ఎడిటర్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**



**"సిద్ధతే శక్తి, అస్త్రాల కంటే వ్యూహమే ఘాతుకం"**

నీళ్ల అంశాన్ని అస్త్రంగా మలచి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేస్తామన్న బీఆర్ఎస్ ఆలోచన ఈసారి పని చేయకపోగా, సీన్ రివర్స్ అయింది. ఎందుకంటే ఈసారి ప్రభుత్వం కేవలం సమాధానాలతో కాదు పక్కాగా ప్రిపేరయి వచ్చి.. మేం ప్రిపేర్ కాలే మేం ఉండం అని ప్రతిపక్షంతో అనిపించింది. నీళ్ల విషయంలో తమకే పట్టు ఉందని, తాము చెప్పిందే నీళ్ళు.. కట్టిందే ప్రాజెక్టు.. చేసిందే వాదన అన్నరీతిలో ఇంతకాలం భావించిన భారత రాష్ట్ర సమితి ఎత్తులు ఈసారి తేలిపోయాయి. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఒప్పందాలు, కట్టిన ప్రాజెక్టులు, పెరిగిన అంచనాలు, చేసిన మార్పులు.. తెరవెనుక ఉద్దేశ్యాలు అన్నీ ప్రజల ముందు ఉంచడంలో కాంగ్రెస్ సర్కారు విజయం సాధించింది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత బీఆర్ఎస్ శాసనసభలో ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవడం ఇదే మొదటిసారి. గత రెండేళ్లలోనూ సభలో ఇంతలా డిఫెన్స్‌లో పడలేదు.

**విజయం నుంచి విశ్వాసం వరకు**

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక విజయం, పంచాయతీ ఫలితాలు, ఇటీవలి కాలంలో సీఎం గ్రాఫ్ పెరగడం ఇవన్నీ కలిసి అధికార పక్షానికి ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాదనకు, వ్యూహాలకు బలం పెరిగింది. అదే సమయంలో ప్రతిపక్షంలో ఆత్మవిశ్వాసానికి గండిపడింది. ఇక బీఆర్ఎస్‌లో అసలు సమస్య సభలో కాదు పార్టీ లోపలే. ఎమ్మెల్సీ, కేసీఆర్ కుమార్తె కవిత పార్టీకి పెనుసవాల్‌గా మారారు. హరీష్‌ను ముందుపెట్టి చేసే రాజకీయాన్ని కవిత బహిరంగంగానే ప్రశ్నించడం, "కేసీఆర్ సభకు రాకుంటే బీఆర్ఎస్ ఖతం" అన్న వ్యాఖ్యలు సంచలనమే. కమిషన్లు తీసుకోవడం, అమ్మడం తప్ప హరీష్ రావుకి ఏం వచ్చని కవిత నిలదీశారు. తప్పులు చేసిన వారు అసెంబ్లీలో ఏం మాట్లాడతారని, ప్యాకేజీలు అమ్ముకున్న ట్రబుల్, బబుల్ షూటర్ ఏం చెబుతారని కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కవిత వ్యాఖ్యలు చేసిన కొద్దిసేపటికే అసెంబ్లీ నుండి బిఆర్ఎస్ బాయ్ కాట్ నిర్ణయం తీసుకుంది. కేసీఆర్ నుండి వచ్చిన సంకేతాల మేరకే బీఆర్ఎస్ అసెంబ్లీ సమావేశాలు బహిష్కరించగా, ఇందుకు కవిత అసెంబ్లీకి వచ్చి చేసిన వ్యాఖ్యలే కారణంగా కనిపిస్తున్నాయి. అసెంబ్లీకి కేసీఆర్ రాకపోవడం ఒక రకంగా మైనస్ అయితే, నీటిప్రాజెక్టులపై సవాల్ చేసి సభలో లేకుండా పోవడం బీఆర్ఎస్ పార్టీకి పెద్ద మైనస్ గా మారింది. కాలానుగుణంగా వ్యూహాలు రూపొందించుకోవడంలో బీఆర్ఎస్ విఫలమవుతున్నట్లు కనిపిస్తోంది.

**పవన్ దిద్దుబాట**

"తెలంగాణోళ్ల దిష్టి కొబ్బరిచెట్లకు తగిలింది" అన్న వ్యాఖ్యలతో తెలంగాణ ప్రాంతంలో విమర్శల పాలైన జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇపుడు నష్టనివారణ చర్యలకు దిగారు. టీటీడీ ద్వారా కొండగట్టు అంజన్న ఆలయానికి భారీగా నిధుల కేటాయింపు చేయడంతో పాటు కొండగట్టు అంజన్నస్వామిని టీటీడీ అధికారులతో కలిసి దర్శించి ఆ డ్యామేజ్ ను కంట్రోల్ చేసుకుని మైలేజీ తెచ్చుకున్నారు. భవిష్యత్ రాజకీయ పరిణామాలు ఎటువైపు తిరుగుతాయో.. తెలంగాణ ప్రాంత ప్రజల మనోభావాలను గాయపరచడం వల్ల నష్టం జరుగుతుందని పవన్ వెంటనే వ్యూహాత్మకంగా దిద్దుబాటకు దిగారు. పవన్ రాజకీయ పరిణతికి ఈ పర్యటన అద్దంపట్టింది.

**వివాదాల చుట్టూ**

తెలుగురాష్ట్రాల్లో గత వారం శివాజీ, అనసూయ, తర్వాత అన్వేష్, గరికపాటి చుట్టూ వివాదాలు తిరిగాయి. శివాజీ వ్యాఖ్యలపై అనసూయ రెచ్చిపోగా, సంస్కారంగా ఉండండి అన్నందుకు.. లైవ్ డిబేట్స్, చర్చలు., గ్రూప్ మీటింగ్ లు అంతా రచ్చయింది. ఎవరిష్టం వారిదే కానీ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించకుంటే సమాజానికే నష్టం జరుగుతుంది. హిందూదేవతలపై నోరుపారేసుకున్న అన్వేష్ కు, గరికపాటి నరసింహారావు లాంటి ప్రజలు అభిమానించే ప్రవచనకర్తపై చేసిన చెత్తవ్యాఖ్యలకు ప్రజలు బాగానే బదులిచ్చారు. ఎవరి తప్పు వారు తెలుసుకుని.. ఎవరి లిమిట్స్ లో వారుంటే సమాజం బాగుంటుందని అన్వేష్ లాంటివారికి అర్థమయ్యేలా ప్రజలు చేశారు. గత కొద్దికాలంగా సోషల్ మీడియానే కాదు లక్షలాది మందికి ఐబొమ్మ రవి, అనసూయ, శివాజీ, అన్వేష్ లపై చర్చలే ప్రధాన టైంపాస్ గా మారి లక్షలాది మంది గంటలకొద్ది సమయాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. పాలిటిక్స్ లో మసాలా తగ్గడంతో ఇలాంటి వాటిపై పడ్డట్లు కనబడుతోంది.

> తెలంగాణ అసెంబ్లీలో కొత్త ముఖచిత్రం. ఒకవైపు పూర్తిగా ప్రిపేర్ అయి వచ్చిన అధికారపక్షం.. మరోవైపు బాయ్‌కాట్ పేరుతో సభను వీడిన ప్రతిపక్షం. నీళ్ళపంచాయతీని మొదలుపెట్టిన బీఆర్ఎస్ సీఎం రేవంత్ రెడ్డి చాణక్యం ముందు తేలిపోయింది. ఎపుడూ నీళ్ళవిషయంలో తమకు మాత్రమే అవగాహన ఉందని, కిందపడ్డా.. నీళ్ళవిషయంలో సర్కారును ఇరకాటంలో పెట్టవచ్చని భావించిన బీఆర్ఎస్ ఎత్తులు పారలేదు.

> తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక బిఆర్ఎస్ కు అసెంబ్లీలో ఇలాంటి పరిస్థితి ఎపుడూ ఎదురుకాలేదు. గత రెండేళ్ళుగా కూడా.. బిఆర్ఎస్ ను కాంగ్రెస్ సభలో ఇంతలా డిఫెన్స్ లో పడేయలేదు. తెలంగాణ రాజకీయాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాధించిన సాధికారితకు, పట్టుకు సభ సాక్షిగా కనిపిస్తోంది.

> నీళ్ల విషయంలో తమకే పట్టు ఉందని, తాము చెప్పిందే నీళ్ళు.. కట్టిందే ప్రాజెక్టు.. చేసిందే వాదన అన్నరీతిలో ఇంతకాలం భావించిన భారత రాష్ట్ర సమితి ఎత్తులు ఈసారి తేలిపోయాయి. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఒప్పందాలు, కట్టిన ప్రాజెక్టులు, పెరిగిన అంచనాలు, చేసిన మార్పులు.. తెరవెనుక ఉద్దేశ్యాలు అన్నీ ప్రజల ముందు ఉంచడంలో కాంగ్రెస్ సర్కారు విజయం సాధించింది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత బీఆర్ఎస్ శాసనసభలో ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవడం ఇదే మొదటిసారి.

> కవిత శాసనమండలికి వచ్చి తీవ్ర విమర్శలు చేసిన కొద్దిసేపటికే అసెంబ్లీ నుండి బిఆర్ఎస్ బాయ్ కాట్ నిర్ణయం తీసుకుంది. కేసీఆర్ నుండి వచ్చిన సంకేతాల మేరకే బీఆర్ఎస్ అసెంబ్లీ సమావేశాలు బహిష్కరించగా, ఇందుకు కవిత అసెంబ్లీకి వచ్చి చేసిన వ్యాఖ్యలే కారణంగా కనిపిస్తున్నాయి. అసెంబ్లీకి కేసీఆర్ రాకపోవడం ఒక రకంగా మైనస్ అయితే, నీటిప్రాజెక్టులపై సవాల్ చేసి సభలో లేకుండా పోవడం బీఆర్ఎస్ పార్టీకి పెద్ద మైనస్ గా మారింది. కాలానుగుణంగా వ్యూహాలు రూపొందించుకోవడంలో బీఆర్ఎస్ విఫలమవుతున్నట్లు కనిపిస్తోంది.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**
mahaapatrika@gmail.com
whatsapp- 74369 39999

# డిజిటల్ విద్యా విప్లవంలో టీసాట్ పాత్ర తెలంగాణకు వరం

ఇంటింటికీ టెక్నాలజీ చేరువ కావాలనే లక్ష్యంతో ప్రారంభించిన టీసాట్ తెలంగాణ రాష్ట్రానికి వరంగా మారింది. అన్ని రంగాలు,వర్గాల వారికి ఆధునిక సాంకేతికత చేరువ కావాలని స్థాపించిన టీసాట్ విజయవంతంగా లక్ష్యాలకు చేరుకుంటోంది. ''ప్రతి ఇల్లు గ్రంథాలయం కావాలి. ప్రతి మెదడుకు జ్ఞానం చేరాలంటే... పుస్తకాలతోనే సాధ్యమవుతుంది'' అని పెద్దలు అంటుంటారు. ఇప్పుడు మారుతున్న కాలానికి అనుగుణంగా పుస్తకం కూడా రూపం మార్చుకుంది. డిజిటల్ రూపంలో పుస్తకాన్ని తెలంగాణలో ఇంటింటికి చేర్చేందుకు టీసాట్ కృషిచేస్తోంది. టీసాట్ తీసుకొచ్చిన ఈ డిజిటల్ విప్లవం తెలంగాణ యువత, విద్యార్థుల భవితకు బాటలు వేయడమే కాకుండా అన్ని వర్గాల వారికి చేరువవుతోంది.



తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ ఇనిషియేటివ్‌గా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్ నేతృత్వంలో నడుస్తున్న ఈ నెట్‌వర్క్ సాఫ్ట్‌నెట్ (సొసైటీ ఫర్ తెలంగాణ స్టేట్ నెట్‌వర్క్) ఆధ్వర్యంలో టీ`సాట్ పేరుతో పనిచేస్తోంది. శాటిలైట్ ద్వారా ప్రసారాలు అందిస్తూ గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లోని విద్యార్థులకు, యువతకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెస్తోంది. టీసాట్ నిపుణ (స్కిల్స్, పోటీ పరీక్షలు), టీసాట్ విద్య (స్కూల్ ఎడ్యుకేషన్) అనే రెండు ప్రధాన చానెళ్లతో పనిచేస్తుంది. ఇవి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా సెల్ఫ్ ప్రిపరేషన్ కి అండగా నిలుస్తున్నాయి. టీసాట్ యాప్, యూట్యూబ్, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కూడా విలువైన కంటెంట్ అందుబాటులో ఉంది. తెలంగాణలోని ఉన్నత విద్యా మండలితో పలు ఎమ్ఓయూలు కుదుర్చుకుని, అన్ని రకాల ప్రసారాలు అందిస్తుండటం విద్యార్థులకు, నిరుద్యోగులకు టీ`సాట్ గొప్ప వరంగా మారింది.

టీసాట్ విజయాలు అసాధారణమైనవి. దేశంలోనే నెంబర్ వన్ ఎడ్యుకేషనల్ నెట్‌వర్క్ గా నిలవడం తెలంగాణకు గర్వకారణం. విద్యా ప్రసార చానెళ్లలో 48 లక్షల యూజర్స్‌తో డిజిటల్ ప్రసారాల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. యూట్యూబ్‌లో 8.4 లక్షలకు పైగా సబ్ స్క్రైబర్స్, సుమారు 14 కోట్లకు పైగా వ్యూస్ టీ`సాట్‌కు ఉన్నాయి. డిజిటల్ శాటిలైట్ ద్వారా 48 లక్షల మందికి పైగా యూజర్స్‌తో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. జీసాట్ 16 శాటిలైట్ ద్వారా తెలంగాణలోని సుమారు 80 లక్షలకు పైగా కుటుంబాలకు వైవిధ్యమైన ప్రసారాలు అందిస్తూ అన్ని వర్గాలకు తోడ్పడుతోంది. రాష్ట్రంలోని ప్రధాన కేబుల్ నెట్‌వర్క్‌లో టీ`సాట్ సేవలు అందుబాటులో ఉండడంతో వీరి ప్రజా ప్రయోజనాల కార్యక్రమాలు ఇంటింటికీ చేరవవుతున్నాయి.

తెలంగాణ విద్యా రంగంలో ఇప్పుడు టీసాట్ ప్రధాన పాత్ర పోషిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, ఐటీ కమ్యూనికేషన్ల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో సీఈఓ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ప్రత్యేక కృషి చేస్తూ టీసాట్ కార్యక్రమాలను విజయవంతంగా ప్రజలకు చేరువ చేస్తున్నారు. డిజిటల్ నెట్‌వర్క్ ద్వారా గ్రామీణ విద్యార్థులు పట్టణ విద్యార్థులతో పోటీపడాలనే మంత్రి శ్రీధర్ బాబు ఇచ్చిన పిలుపును సాకారం చేసేందుకు టీసాట్ సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారు. పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు టీ`సాట్ రాష్ట్ర వ్యాప్తంగా 'విద్యార్థుల వార్షిక పోటీలు`2025' కార్యక్రమం ద్వారా క్విజ్, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు ఏర్పాటు చేయడంతో పెద్ద ఎత్తున విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందుకున్నారు. నవంబర్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 22 వేలకు పైగా విద్యార్థులు పాల్గొన్నారంటేనే టీ`సాట్‌కు తెలంగాణ విద్యా రంగంలో లభిస్తున్న ప్రాధాన్యత తెలుస్తోంది.

మహాత్మా గాంధీ యూనివర్సిటీ ద్వారా ట్రావెల్ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ కోర్సులో ప్రత్యేక పాఠ్యాంశాలను టీ`సాట్ బోధిస్తోంది. టీసాట్, ఫోటానిక్స్ వ్యాలీ కార్పొరేషన్ సంయుక్తంగా వీఎల్ఎస్ఐ పై వృత్తి నైపుణ్య శిక్షణ కూడా అందిస్తోంది. ప్రజలకు అవసరమైన విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, వృత్తి నైపుణ్యం, భాషా నైపుణ్యాలపై ప్రత్యేక కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది. ప్రత్యేకంగా ఐదు యూట్యూబ్ చానెళ్లతో, మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా రీల్స్ రూపంలోనూ కంటెంట్ అందిస్తోంది.

పోటీ పరీక్షలలో టీసాట్ యువతకు చేదోడుగా నిలిబడిరది. టెట్, డీఎస్సీ పోటీ పరీక్షల్లో అభ్యర్థుల విజయానికి టీసాట్ కంటెంట్ కీలకంగా మారుతోంది. టీసాట్ సేవలతో వారు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములుగా మారడం టీ`సాట్‌కు గర్వకారణం. పోటీ పరీక్షలకు సంసిద్ధమయ్యే వారి కోసం ప్రధాన సబ్జెక్ట్ జనరల్ స్టడీస్ పై 'జీఎస్ ఫర్ ఆల్' పేరిట ప్రత్యేక పాఠాలు ప్రసారం చేస్తోంది. టీజీపీఎస్సీ గ్రూప్ 1, 2, 3 ఉద్యోగాలతో పాటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ పరీక్షలకు నాణ్యమైన కంటెంట్ అందిస్తోంది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉద్యోగాల సాధనలో తోడ్పాటు అందించడానికి టీసాట్ నెట్‌వర్క్ డొమైన్‌లో 40 వేలకు పైగా వీడియోలు అందుబాటులో ఉన్నాయి. తెలంగాణలో విద్యార్థులు తమ ప్రతిభకు పదును పెట్టుకోవడానికి, ఉద్యోగాలు సాధించడానికి టీసాట్ సేవలను ఆయుధంగా ఉపయోగించుకుంటున్నారు. అంతేకాక తెలంగాణ స్కిల్ హబ్, టాస్క్ వంటి స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్‌లతో కూడా టీ`సాట్ సమన్వయం చేసుకుంటూ ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. విద్యార్థులకు, యువతకు మార్గదర్శకంగా స్వాతంత్ర్య సమర యోధులు, వివిధ రంగాల్లో అవార్డులు పొందిన వారి గొప్ప వ్యక్తుల అనుభవాలను 'స్ఫూర్తి' అనే కార్యక్రమం పేరుతో ప్రసారం చేస్తూ మానవ విలువల పెంపుకు టీ`సాట్ కృషి చేస్తుంది. ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం, తెలంగాణ పశుసంవర్ధక శాఖల సమన్వయంతో 'నిపుణ' పేరిట రైతుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తోంది. వైద్య నిపుణులతో వైద్య సలహాలు కూడా అందిస్తున్న టీ`సాట్ మహిళా శిశు సంక్షేమానికి సంబంధించి ప్రతి రోజు కార్యక్రమం ప్రసారం చేస్తుండడంతో అంగన్‌వాడీ టీచర్లకు, కార్యకర్తలకు ఉపయోగకరంగా ఉంది. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా బోనాలు, బతుకమ్మ పండుగలపై ప్రత్యేక వీడియోలు రూపొందించి మన సంప్రదాయాలకు పెద్ద పేట వేస్తోంది. టీసాట్ ప్రభావం ఇప్పటికే అనేక కోణాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. గ్రామీణ విద్యార్థులు పట్టణ విద్యార్థులతో సమానంగా పోటీపడేలా సంస్థ ప్రోత్సాహిస్తోంది. ఆరోగ్యం, వ్యవసాయం, మహిళలు పిల్లల సంక్షేమం, సాంస్కృతిక కార్యక్రమాలతో రాష్ట్ర ప్రజల సమగ్ర అభివృద్ధికి దోహదం చేస్తోంది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీలో టీసాట్‌ను చేర్చాలని ఇటీవలే అధికారులు సూచించడం ఈ సంస్థ విద్యా రంగానికి చేస్తున్న సేవలకు నిదర్శనంగా నిలవడమే కాకుండా రాష్ట్ర విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాల్లో పోషిస్తున్న ప్రధాన ప్రాముఖ్యతను తెలియజేస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో టీసాట్ తెలంగాణ ప్రజలను జ్ఞానవంతులను చేసే మిషన్ లో విజయవంతంగా దూసుకుపోతోంది. టీ`సాట్ కేవలం ఒక డిజిటల్ విద్యా సాధనం మాత్రమే కాదు, తెలంగాణ విద్యా విభాగంతో పాటు అన్ని రంగాల్లో మార్పుకు మార్గదర్శకంగా నిలుస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అందరి మన్ననలు పొందుతోంది.

**- ఐ.వి.మురళీ కృష్ణ శర్మ,**
**సీనియర్ జర్నలిస్టు.**

## గిరిజనుల ఇళ్లను కూల్చేసిన అధికారులపై
# చర్యలు తీసుకోవాలి

- గిరిజనులకు సీపీఎం అండగా ఉంటుంది
- సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లీ దేవేందర్



**మొయినాబాద్ మహా:** గిరిజనుల ఇళ్లను కూల్చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, గిరిజనులకు సీపీఎం అండగా ఉంటుందని, సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లీ దేవేందర్ పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని పెద్ద మంగళారం రెవెన్యూలో సర్వేనంబర్ 210, 211,212 లో గిరిజనులు న్యాయబద్ధంగా చట్టబద్ధంగా ప్లాట్లు కొనుగోలు చేసి అన్ని అనుమతులతో ఇల్లు నిర్మించుకున్నారని, అన్నారు. కొంతమంది రాజకీయ పెద్దల రియల్ ఎస్టేట్ బ్రోకర్ల ప్రోత్సాహంతో మున్సిపల్ అధికారులు గిరిజనుల ఇళ్లను కూల్చివేయడాన్ని సీపీఎం పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, సీపీఎం మొయినాబాద్ మండల కార్యదర్శి సీహెచ్. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారులు కూల్చేసిన ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లీ దేవేందర్ మాట్లాడుతూ.. 111 జీవో సాకుతో పేదల ఇళ్లను కూల్చి వేస్తున్నారని, ధనికుల ఫామ్ హౌస్, రిసార్ట్స్, కమర్షియల్ బిల్డింగ్స్ జోలికి వెళ్లకుండా పేదలపై ప్రతాపం చూపుతున్నారని, అన్నారు. ఇళ్ల కూల్చివేతకు కారణమైన రియల్ ఎస్టేట్ బ్రోకర్లపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, ఇండ్లు కూల్చేసిన మున్సిపల్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల తరపున సీపీఎం పార్టీ న్యాయపోరాటం చేస్తుందని, వారికి న్యాయం జరిగేంత వరకు వారికి అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మొయినాబాద్ మండల నాయకులు మహేందర్, రాజేందర్, చెన్నయ్య, నరసింహ, ప్రభుదాస్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




**ఆమనగల్లు, మహా:** భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమనగల్లు మండల పరిధిలోని లిటిల్ స్కాలర్ టెక్నో స్కూల్ లో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పుష్పాలతో నివాళులర్పించారు. బాలికా విద్య, బలహీన వర్గాల విద్య, స్త్రీల హక్కులు, సమాజంలోని అసమానతలపై సావిత్రిబాయి పూలే చేసిన పోరాటాన్ని పాఠశాల చైర్మన్ చుక్క అల్లాజీ గౌడ్ వివరించారు. విద్యార్థులు ఆమెను ఆదర్శంగా తీసుకొని చదువులో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చుక్క సావిత్రి, ఇన్చార్జ్ చెన్నయ్య, హైమావతి, శ్రీ జన్య ఉపాధ్యాయులు యాదయ్య , శ్రీశైలం ,మమత ,తేజ ,మౌనిక తదితరులు పాల్గొన్నారు

## మణికొండ ప్రభుత్వ పాఠశాలలో
## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



**గండిపేట,మహా:** గండిపేట మండలం మణికొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆడబిడ్డలకు విద్యాప్రదాతగా, మహిళా చైతన్య స్ఫూర్తిగా ఆమె చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆమె నడిచిన బాటలో అడుగులు వేస్తూ మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయురాలను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మణికొండ మాజీ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కొండకల్లా నరేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్ స్వామి, మాజీ కోఆప్షన్ మెంబర్ జే. సిద్ధప్ప, మాజీ సర్పంచ్ నరేష్ పాల్గొని పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. వారితో పాటు బి. రవికాంత్ రెడ్డి, చిలుకూరి బీరప్ప, బి. శ్రీరాములు, రాజేష్, శ్రీనివాస్ రెడ్డి, గంగాధర్, వినోద్, లక్ష్మీ శ్రీ, శివగంగ, పాఠశాల హెడ్మాస్టర్ దశరథ్ గారు మరియు ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## లావాణి పట్టా భూములలో క్రయవిక్రయాలు జరిపితే
# చట్టపరమైన చర్యలు తప్పవు

ఎమ్మార్వో రవీందర్ దత్



**రాజేంద్రనగర్, మహా :** శంషాబాద్ మండలం మదనపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 50 లోని లావాణి పట్ట భూములను ఎమ్మార్వో రవీందర్ దత్ తో కలిసి రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో వెళ్లి రైతులతో ఈ భూమి కి సంబంధించి పత్రాలను పరిశీలించి వివరాలను సేకరించారు. లావాణిపట్ట దారులు సర్వే నెంబర్ 50 లో క్రయ విక్రయాలు జరపరాదని రైతులకు సూచించారు. గతంలో ప్రభుత్వం వ్యవసాయం చేసుకోవడానికి మాత్రమే లావాణి భూములు ఇచ్చారు. లావాణి భూమిలో క్రయవిక్రయాలు జరపరాదు జరిపిన అవి చెల్లుబాటు కాదున్నారు. ఎవరైనా క్రయ విక్రయాలు జరిపితి వారిపైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో 50 నెంబర్ సర్వే భూములను ప్రభుత్వము స్వాధీనం చేసుకోబోతుందిని సమాచారం.

## లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోండి



**ఆమనగల్లు, మహా:** లయన్ జిల్లా గవర్నర్ (320A) లయన్ డాక్టర్. గడ్డం మహేందర్ కుమార్ రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 3 నుండి 11వ తేది వరకు ఉచిత అన్నదాన ప్రసాద సేవా కార్యక్రమం, ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో 52 మంది రోగులకు పండ్లు, బ్రేడ్లు, పాలు అందచేసారు. లయన్ సభ్యులు జంగయ్య కడ్తాల్ మండల ప్రధానోపాధ్యాయులు సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి రోగులకు అందజేశారు.. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పేదప్రజల ఆకలి తీర్చడం లయక్స్‌క్లబ్ ముఖ్య ఉద్దేశమని, ఆకలితో అలమటిస్తున్న వారికి లయన్స్ క్లబ్ అండగా ఉంటుందని ఆయన అన్నారు. క్లబ్ సభ్యుల సహకారంతో టి అన్నదాన కార్యక్రమాలను ఈనెల 3 నుండి 14 వరకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో అమనగల్లు జిల్లా చెర్మన్లు బి యాదయ్య గుప్త, యం చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఎంగలి, బాల క్రిష్ణ క్లబ్ సభ్యులు కర్నాటి, కొండల్ రెడ్డి, అల్లాజిగౌడ్, సుధీర రెడ్డి, మెడికల్ ఆఫీసర్. మంజులదేవి, హెల్త్ సూపర్ వైజర్, తిరుపతి రెడ్డి, రూపం వెంకటరెడ్డి క్లబ్ పి ఆర్ ఓ పాష తదితరులు పాల్గొన్నారు .

## తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ చలో అసెంబ్లీ పిలుపుతో అక్రమ అరెస్టులా..

రంగారెడ్డి జిల్లా ( ఏఐటియుసి )
కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి




**రాజేంద్రనగర్, మహా :** తెలంగాణ ఆటోరిక్షా డ్రైవర్ యూనియన్(ఏఐటియుసి) రాష్ట్ర కమిటీ చలో అసెంబ్లీ పిలుపునివ్వడంతో రంగారెడ్డి జిల్లా ఏఐటియుసి కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ని ఉదయం5 గంటలకే ముందస్తు అరెస్ట్ చేసి మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ లో నిర్బంధించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరసన తెలుపుకోవడానికి స్వేచ్ఛ కల్పిస్తున్నామని చెపుతూనే నిర్బంధాలు విధించడం దారుణం. ఈ సందర్భంగా వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే రెండు సంవత్సరాలు పూర్తయిన ఆటో డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి రూ.12000/లు ఇస్తామని చెప్పారు. నేటి వరకు కూడా రాష్ట్రంలోని ఒక ఆటో డ్రైవర్ కు అమలు చేయలేదు. రాష్ట్రంలోనీ ఆటో రవాణా కార్మికులకు (డ్రైవర్స్) సంక్షేమ బోర్డుని ఏర్పాటు చేయాలన్నారు. ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి. ఆటో డ్రైవర్లకు 50 సంవత్సరాలు నిండిన వారందరికీ పింఛన్లు ఇవ్వాలన్నారు. ఉచిత బస్సు ప్రయాణంవల్ల నష్టపోతున్న డ్రైవర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంజి, మహేష్ యాదవ్, నిరంజన్, మాధవులు, రాజు, గోపాల్, రాజేష్, వెంకటేష్, సిద్ధులు తదితరులు పాల్గొన్నారు.

## పొగ మంచులో ప్రజలు ప్రయాణాలు చేయకండి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




**వరంగల్ హన్మకొండ మహా;** వాతావరణంలో ఇటీవల పొగమంచు తీవ్రత పెరగటంతో వీలైనంత వాహనదారులు రాత్రి, తెల్లవారుజామున ప్రయాణాలు చేయద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు. వాతావరణంలో పొగమంచు తీవ్రత పెరగడం కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ప్రజలను వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రకటన చేస్తూ. రాత్రి, తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కారణంగా రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు, పాదచారులను గుర్తించడం, వీక్షించే సామర్థ్యం తక్కువగా వుంటుంది. ఈ సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశాలు ఉన్నందున, ప్రజలు అత్యవసరమైతే తప్ప ఈ సమయాల్లో ప్రయాణాలను మానుకోగలరని వరంగల్ సీపీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.అలాగే పొగమంచు ఎక్కువగా ఉండే సమయంలో వాహనాలు నడుపుతున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీపీ సూచిస్తూ వాహనాలను వేగంగా నడపొద్దని, వాహనదారులు శ్రద్ధతో, నిదానంగా ప్రయాణించాల్సి ఉంటుందని తక్కువ వీక్షించే సామర్థ్యం కారణంగా ఇతర వాహనాలు, పాదచారులు, మలుపులు, రోడ్డు విభాగాలు సరిగా కనిపించక ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున, హెడ్‌లైట్లను లో బీమ్‌లో ఉంచి, ఫాగ్ లైట్లను వాడాలని సూచించారు. అత్యవసర సమయాల్లో ప్రయాణం తప్పనిసరి అయితే వాహనాల స్థితిని ముందుగానే తనిఖీ చేసుకోవటం తో పాటు ముఖ్యంగా బ్రేకులు, లైట్లు, వైపర్లు సరిగా ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని ముఖ్యంగా డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, అకస్మికంగా ఓవర్‌టేక్ చేయడం, ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించడం వంటి ప్రమాదకరమైన చర్యలకు పాల్పడవద్దని పోలీసుల సూచనలతో పాటు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహనదారులు వారి గమ్యస్థానాలకు క్షేమంగా చేరుకోవడమే ప్రధాన లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ సీపీ వెల్లడించారు.




## సామాన్యులకు అందుబాటులో
# ఓపెన్ ప్లాట్స్

**రంగారెడ్డి జిల్లా మహా:** నమ్మకానికి మారుపేరుగా వందేభారత్ డెవలపర్స్, నమ్మకంతో ప్లాట్ కొనండి లాభాలను అర్జించండి అని చైర్మన్ వై శ్రీనివాసరావు అన్నారు. హైదరాబాదులోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో ఏర్పాటుచేసిన వందేభరత్ డెవలపర్స్ రియల్ ఎస్టేట్ స్టాల్ ని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై. శ్రీనివాసరావు ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, మంచాల మండల ప్రాంతంలో సరసమైన ధరలకు సామాన్యులకు అందుబాటులో ఓపెన్ ప్లాట్స్, ఫామ్ లాండ్స్, విల్లాస్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్ కు వచ్చే ప్రజలు తమ సంస్థలో వివరాలను తెలుసుకొని, మాపై నమ్మకం ఉంచి, వందే భారత్ డెవలపర్ సైట్ ను సందర్శించి నమ్మకంతో ప్లాట్ కొనండి లాభాలను అర్జించండి, మీ భవిష్యత్ తరాలకు లాభాలను అంద చేయవలసిందిగా కోరుతున్నామని, చైర్మన్ వై శ్రీనివాసరావు అన్నారు.




## చీకట్లో మగ్గుతున్న నూతన గృహాలకు
## కరెంటు కలెక్షన్స్ మీటర్లు
# మంజూరు చేయాలి

బీఆర్ఎస్ పార్టీ నాయకులు
కోన్నమొల్ల శ్రీనివాస్

**రాజేంద్రనగర్ మహా :** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని నూతన ఇళ్లకు (గృహాలకు) గత ఆరు నెలలుగా కరెంటు కనెక్షన్లు/మీటర్లు ఇవ్వడం లేదు. ఎందుకు ఇవ్వడం లేదు అంటే విద్యుత్ అధికారులు కొత్తగా వచ్చిన విద్యుత్ నిబంధనల ప్రకారం ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఉంటేనే కరెంటు మీటర్ కనక్షన్స్ లు మంజూరు చెయ్యాలి. కానీ శంషాబాద్ లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వడం లేదు. అక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో పేద మధ్య తరగతి ప్రజలు కరెంటు సమస్యతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కరెంటు సమస్యలను పరిష్కరించాలనిశంషాబాద్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు శనివారం శంషాబాద్ పరిధిలోని ఎలక్ట్రిసిటీ కార్యాలయంలో శంషాబాద్ విద్యుత్ అధికారులు ఏఈ,ఏడి, రాజేంద్రనగర్ సర్కిల్ డి ఈ లకు వినతి పత్రాలు అందజేశారు. గతంలో ఏ విధంగా విద్యుత్ కలెక్షన్స్ మీటర్లను మంజూరు చేశారో. అదే పద్ధతిలో మంజూరు చేయాలని విద్యుత్ కార్యాలయం ముందు డిమాండ్ చేశారు. పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని విద్యుత్ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలోబిఆర్ఎస్ నాయకులు కోన్నమొల్ల శ్రీనివాస్,చిన్నగండు రాజేందర్, మంచర్ల శ్రీనివాస్, రాచమల్ల జయసింహ,ప్రదీప్ రెడ్డి, పరమేశ్వరి, నరేందర్,పరంధాములు, మురళి గౌడ్,పవిత్ర సాగర్, హన్మంతు,రాచమల్ల రమేష్,రమేష్‌రాథోడ్,గుంటి చరణ్, శేఖర్ యాదవ్, జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పన్ను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు

సమీక్షా సమావేశంలో జోనల్ కమిషనర్ చంద్రకళ డిప్యూటీ కమిషనర్, సర్కిల్ కమిషనర్లకు దిశానిర్దేశం




**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో శనివారం డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు,4 సర్కిల్ మున్సిపల్ కమిషనర్లు రెవెన్యూ టాక్స్ ఇన్స్పెక్టర్లు, బిల్ కలెక్టర్ల తో మార్చు 31 ఆర్థిక సంవత్సరంనకు ఆస్తిపన్ను వసూలు చేయడంలో పురోగతి సాధించాలి 100% ఇంటి పన్నులు చెల్లింపులు జరగాలి. శంషాబాద్ జోనల్ వ్యాప్తంగా పారిశుద్ధంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి. పరిశుభ్రత పై ప్రజల్లో అవగాహన పెంచాలి. ఆస్తి పన్ను వినియోగదారులు ఆన్లైన్ పేమెంట్ ద్వారా డబ్బులు చెల్లించవచ్చు.

## క్రమశిక్షణకు మారుపేరుగా
## అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నిలుస్తుంది

త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి




**రాజేంద్రనగర్, మహా ;** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ 44వ రాష్ట్ర మహాసభలు శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నూతన అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా త్రిపుర గవర్నర్ నల్ల ఇంద్రసేనారెడ్డి హాజరయ్యారు. యువతను ఉద్దేశించి త్రిపుర గవర్నర్ నల్ల ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ యువత దేశ అభివృద్ధిలో దూసుకెళ్లాలని అన్ని రంగాల్లో యువత రాణించాలన్నారు. చదువుతోపాటు జ్ఞాన మందించే క్రమశిక్షణ కలిగిన సంస్థ ఏదైనా ఉందంటే అది కేవలం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత సంఘటన మంత్రి ఆశిష్ చౌహాన్, దక్షిణ క్షేత్ర సంఘటన మంత్రి చెరిగే శివకుమార్, ప్రాంత సంఘటన మంత్రి విష్ణువర్ధన్ , గ్రేటర్ హైదరాబాద్ సంఘటన మంత్రి రాజశేఖర్, శంషాబాద్ విభాగ్ సంఘటన మంత్రి మల్లికార్జున్, శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కళ్లెం సూర్యప్రకాష్, జిల్లా కన్వీనర్ పవన్ జగదీష్, నగర కార్యదర్శి భరత్, విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

విద్యార్థులకు సామాజిక రుగ్మతలు తొలగించేలా ఉపాధ్యాయులు కృషి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** విద్యార్థులకు విద్యా బోధనతోపాటు సామాజిక రుగ్మతలను తొలగించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతినీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించిన నేపథ్యంలో శనివారం సమీకృత జిల్లా కార్యాలయంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ మహిళ ఉపాధ్యాయుల దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...సావిత్రి బాయి జయంతిని మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని, దేశంలోనే తొలి మహిళ ఉపాధ్యాయురాలిగా, సంఘసంస్కర్తగా సావిత్రిబాయి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. విద్య అజ్ఞానాన్ని దూరం చేస్తుందని తెలియజేస్తూ బాలిక విద్యను ప్రోత్సహించారని, మహిళల హక్కుల కోసం తన వంతు కృషి చేశారని తెలిపారు. మహనీయులను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ వారి ఆశయ సాధన దిశగా కృషి చేయాలని తెలిపారు. 19వ శతాబ్దంలో మన దేశంలో మహిళలకు చదువు నేర్పించేందుకు ఎన్నో అవాంతరాలను ఎదుర్కొని మహాత్మా జ్యోతిరావు పూలే విశేష కృషి చేయగా, ఆయన సహకారంతో సావిత్రిబాయి పూలే 1848లో పూణేలో మహిళలకు మొట్టమొదటి పాఠశాలను ఏర్పాటు చేసి విద్యా బోధన చేశారన్నారు. ఆమె స్ఫూర్తితో మహిళ ఉపాధ్యాయులు పుస్తకాల్లోని పాఠ్యాంశాలనే కాక విద్యార్థులకు సామాజిక అంశాల పట్ల కూడా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో నేటికీ కొంతమంది బాల్యవివాహాలను చేస్తున్నారని, సామాజిక రుగ్మతులను రూపుమాపేందుకు ఉపాధ్యాయులు తమ వంతు పాత్ర పోషించాలన్నారు. బాలికలు ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన బోధనను అందించి ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని, అందుకు మీరంతా కృషి చేయాలని, నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు. ఉత్తమ మహిళా ఉపాధ్యాయులుగా ఎంపికైన మీరంత ఇంకా బాధ్యతతో విద్యను అందించాలని అన్నారు. అనంతరం ఎంపిక చేసిన 13 మంది ఉత్తమ మహిళా ఉపాధ్యాయులను కలెక్టర్ శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుసిందర్ రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షునిగా సంగెం రాజు



**రంగారెడ్డి జిల్లా మహా:** బీసీ సంక్షేమ సంఘం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షునిగా యాచారం మండలం, నానక్ నగర్ గ్రామానికి చెందిన సంగెం రాజు నియమితులయ్యారు. శనివారం ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు పార్లమెంటు సభ్యులు ఆర్ కృష్ణయ్య ఆదేశాల మేరకు, జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్, సంగెం రాజు పేరును ప్రకటించి, ఆర్ కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంగం రాజు మాట్లాడుతూ... తనపై నమ్మకంతో బీసీ సంక్షేమ సంఘం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షునిగా నియమించినందుకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. బీసీల హక్కు కోసం ఆర్. కృష్ణయ్య చేసే ప్రతి ఉద్యమంలో తన వంతు పాత్ర పోషిస్తున్నారు. బీసీల ఐక్యత, బీసీ సమస్యల పరిష్కారం, సంక్షేమం హక్కుల కోసం నిరంతరం పోరాడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో నానక్ నగర్ సర్పంచ్ సంగెం చైతన్య, ప్రవీణ్ అభిలాష్, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు జంగారెడ్డి పల్లి గ్రామంలో ఈరోజు టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ. 25 లక్షలతో 220 మీటర్ల వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ తో కలిసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఖాదర్ ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే మున్సిపల్ అభివృద్ధి జరుగుతుందన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామచంద్రి, దుద్దు సాయిలు, జంతుక శ్రీశైలం, జంగయ్య, దుద్దు మల్లేష్, జంతుక యాదయ్య మరియు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గ్రామీణ రుణాలను
## సద్వినియోగం చేసుకోవాలి

మేనేజర్ సంధ్యారాణి

**రాజేంద్రనగర్, మహా :** తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పెద్ద షాపూర్ శాఖ ఆధ్వర్యంలో శంషాబాద్ మండలం పిల్లోని గూడ గ్రామంలో నా బోర్డ్ సహకారంతో శనివారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు పథకాలు, రైతు సంక్షేమం, డ్వాక్రా సంఘాల రుణాల విషయాలను ప్రజలను చైతన్యపరచే అవగాహన సదస్సులో జానపద గీతాల ద్వారా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్వర్ణలత, ఉప సర్పంచ్ శ్రీశైలం, వార్డు సభ్యులు, గ్రామ రైతులు బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కాలనీ సమస్యలను
# పరిష్కరించండి

**ఆమనగల్లు, మహా :** పట్టణ శివారులోని 11 వ వార్డు పరిధిలో గల ఆదర్శ నగర్ కాలనీల్లో నెలకొని ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాలనీవాసులు శనివారం మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ కి వినతిపత్రం అందజేశారు. ఆ కాలనిలో ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధికి మాత్రం నోచుకోలేక పోయాయన్నారు. కాలనీల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువ వ్యవస్థ, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందన్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి కాలనీల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం ద్వారా కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో యంఎ ఖలీల్, అలీమ్, ఫరిద్, నాజర్, రఫీ, వలి, డేవిడ్, చంద్రశేఖర్, యాదయ్య, మల్లేష్, చారి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు



## ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డిను కలిసిన
## మణికొండ భాజపా నాయకులు

**గండిపేట,మహా:** మణికొండ డివిజన్ మరియు రాజేంద్రనగర్ నియోజకవర్గానికి సంబంధించిన వివిధ అభివృద్ధి మరియు పౌర సమస్యలపై పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ని శనివారం మణికొండ సీనియర్ బీజేపీ నాయకులు మరియు మాజీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు.రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల సన్నాహాలు, పార్టీ కార్యక్రమాలు మరియు సంస్థాగత కార్యకలాపాలపై కూలంకషంగా చర్చించారు.మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వ సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అదే సమయంలో గత బీఆర్ఎస్ మరియు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాలని ఎంపీ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ముఖ్యంగా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అల్కాపూర్ టౌన్‌షిప్ నుండి ఓఆర్ఆర్ లింక్ రోడ్డు సమస్య ప్రధాన చర్చకు రావటం తో, ఈ విషయంపై ఇప్పటికే రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ సంజయ్ సేథ్‌ను కలిశానని, ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించి రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా కృషి చేస్తానని ఎంపీ తెలిపారన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రవికాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వినోద్, మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్ స్వామి, మాజీ కోఆప్షన్ సభ్యుడు సిద్ధప్ప, సీనియర్ నాయకులు బీరప్ప, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రాజేష్ గారు, చిరంజీత్ ఘోష్ మరియు ఇతర పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగిద్దాం

**బిజెపి రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు**



**వరంగల్ మహా;** సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా వరంగల్ నగరంలోని కాకతీయ యూనివర్సిటీలో ఉన్న ఆ మహనీయురాలి విగ్రహానికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ, మహిళా విద్యకు అంకితమై సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం పోరాడిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. ఆమె చేపట్టిన విద్యా ఉద్యమమే నేటి సమానత్వ సమాజానికి పునాది అని తెలిపారు. మహిళల విద్య, స్వాతంత్ర్యం, సమాన హక్కుల కోసం ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. సావిత్రిబాయి పూలే ఆశయాలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని, ముఖ్యంగా యువత విద్యను ఆయుధంగా చేసుకొని సమాజ పురోగతికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బిజెపి పార్టీ ఎల్లప్పుడూ మహిళా సాధికారతకు, విద్యా విస్తరణకు కట్టుబడి ఉందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు మార్టిన్ లూథర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు కందిమల్ల మహేష్, మండల అధ్యక్షులు బోరిగం నాగరాజు, తాళ్ల పెల్లి అర్జున్, విప్ప సుధాకర్, బిజెపి సీనియర్ నాయకులు కోమాకుల నాగరాజు, ఇనుముల అజయ్, పూజారి అజయ్ గౌడ్, కోట సతీష్, మడిపల్లి నాగరాజు, బక్కి రంజిత్ తోట సురేష్, తమ్మిశెట్టి క్రాంతి, జన్ను సుబ్రహ్మణ్యం, కందకట్ల మల్లికార్జున్, బి కే రాజు, బీజేవైఎం తూర్పు నియోజకవర్గ కన్వీనర్ గోడిశాల కార్తీక్ గౌడ్, ఆదిత్య చిన్న, అఖిల్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# వేలాల గట్టు మల్లన్న ఆలయ అభివృద్ధికి చర్యలు

**పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ**



**మంచిర్యాల, మహా :** వేలాల గట్టు మల్లన్న ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. శనివారం జైపూర్ మండలం వేలాల గట్టు మల్లన్న స్వామి ఆలయాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఇతర అధికారులతో కలిసి మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ గట్టు మల్లన్న స్వామి ఆలయ అభివృద్ధికి అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. మల్లన్న స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా రోడ్లు, ఆలయ ప్రాంగణంలో అవసరమైన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో రహదారి ఏర్పాటుకు అవసరమైన అటవీ శాఖ అనుమతుల ప్రక్రియ త్వరగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రతి పౌర్ణమికి గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎం.పి. లాడ్స్ క్రింద నిధులు కేటాయించి ఆలయ పరిధిలో అభివృద్ధి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డిసిసి అధ్యక్షులు పి రఘునాథ్ రెడ్డి, మండల ఉప తహసిల్దార్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనుల అంచనాలను పరిశీలించిన కమిషనర్

**వరంగల్ మహా;** బల్దియా పరిధి లోని 3వ డివిజన్ ఆరేపల్లి లో స్థానికుల అభ్యర్థన మేరకు సి సి రోడ్డు తో పాటు డ్రైన్ నిర్మాణాల కోసం బల్దియా ఇంజినీరింగ్ అధికారులు రూపొందించిన ప్రతిపాదనలను కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ శనివారం క్షేత్ర స్థాయిలో సందర్శించి అట్టి ప్రతిపాదనల తో పాటు నిర్మిత ప్రాంతాలను ప్రత్యక్షం గా పరిశీలించారు. ఈ కార్యక్రమం లో ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డి ఈ సతీష్, టి పి ఎస్ నవీన్, తదితరులు, పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలు

**నివాళులర్పించిన ఎస్ఎస్ యు జిల్లా అధ్యక్షులు**




**హన్మకొండ మహా;** స్వేరో స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో హన్మకొండ జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయికుమార్ కాకతీయ యూనివర్సిటీ ఎస్డిఎల్సి ప్రాంగణం వద్ద చదువుల తల్లి సావిత్రిబాయి పూలే విగ్రహానికి 195వ జయంతి ని పురస్కరించుకొని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ జిల్లా కమిటీ వారు నివాళులర్పించారు. మొట్టమొదటి భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు మాత చదువుల తల్లి సావిత్రిబాయి పూలే ఎన్నో అవమానాలను ఎదుర్కొని, మహిళా సోదరీమణులకు అందరికీ చదువు అనే ఆయుధంతో ఈ ప్రపంచాన్ని జయించ వచ్చునని తెలిపిన మహోన్నతురాలు చదువుల తల్లి సావిత్రిబాయి పూలే. అదేవిధంగా ఈనాటి సమాజంలో ఎందరో మహిళలు సావిత్రిబాయి పూలే ను స్ఫూర్తిగా తీసుకొని విద్యావేత్తలు గా రాజకీయంగా, ఇటు ఆర్థికంగా వ్యాపార రంగంలోనూ మహిళా సోదరి మణులను రాణిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షులు మోజేష్, సుఖేష్, రాకేష్, రావణ్ ,మహేష్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు

**యాదాద్రి భువనగిరి, మహా:** జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యా, సామాజిక సంస్కర్త, ఆధునిక భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రి బాయి పూలే చిత్రపటానికి సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ హనుమంత రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా కు పెద్ద పీట వేసిదని, మహిళలు విద్యావంతులు అయితే ఆ కుటుంబము అన్ని విధాలుగా మంచిగా ఉంటుందని అన్నారు. మహిళలు సావిత్రి భాయి పూలేను ఆదర్శం గా తీసుకోవాలన్నారు. ఉత్తమ విద్యా బోధనలు అందించిన మహిళా ఉపాధ్యాయనియులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, బీసీ వెల్ఫేర్ అధికారి సాహితి, విద్యాశాఖ ఏడి ప్రశాంత్ రెడ్డి,జిల్లా అధికారులు,కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# బాలిక విద్యతో సమాజాభివృద్ధి

**పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ**



**మంచిర్యాల, మహా :** బాలికా విద్యతో కుటుంబ, సమాజం అభివృద్ధి చెందుతుందని పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. శనివారం జిల్లాలోని కన్నెపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహావిష్కరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మండల తహసిల్దార్ రాంచందర్ లతో కలిసి హాజరై విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ బాలిక విద్య ద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని తెలుపుతూ మహిళలు చదువుకునేందుకు విశేష కృషి చేసిన సావిత్రిబాయి పూలే జయంతి రోజున విగ్రహావిష్కరణ చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. గృహం, కుటుంబాలు బాగుంటేనే సమాజం బాగుంటుందని అన్నారు. సావిత్రిబాయి పూలే తన భర్త తో కలిసి బాల్య వివాహాలు, సతీసహగమనం లాంటి దురాచారాలను అరికట్టేందుకు అహర్నిశలు కృషి చేశారని వెల్లడించారు. భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి పూలే అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. మాలీ ల సమస్యలను కేంద్ర దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని, మాలీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు ఎం.పి. లాడ్స్ నిధులనుండి సహకరిస్తానని తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలలో 5 వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు మంజూరు అయ్యాయని, మంచిర్యాల జిల్లాలో వందే భారత్ ట్రైన్ నిలుపుదల చేయడంతో ఎంతో మందికి ఉపయోగంతో పాటు రైల్వే శాఖకు ఆదాయం కూడ పెరిగిందని స్పష్టం చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందని ఆయన వెల్లడించారు. ఇందులో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. విద్య ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని, విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యపడుతుందని తెలిపారు. మహిళా విద్యతో కుటుంబం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. భూమి ఉన్న వారికి భూమి, డబ్బు ఉన్న వారికి డబ్బు ఉంటుందని, కానీ చదువుకుంటే ఉన్నత స్థాయికి ఎదగవచ్చని, ఆదర్శంగా ఉండవచ్చని తెలిపారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి కొరకు ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టరేట్ లో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

**హన్మకొండ మహా;** భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ రవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే జయంతి ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించి విద్యా బోధనలో ఉత్తమ పనితీరు కనబరిచిన మహిళా ఉపాధ్యాయినులను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా శాలువాలతో ఘనంగా సత్కరించి ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ సావిత్రిబాయి పూలే సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వైవి గణేష్, డీఈవో గిరిరాజ్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి, విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి వెండి పాదాలకు దంపతుల కానుక

**హెడ్ కానిస్టేబుల్ భరత్ కుమార్ ధనలక్ష్మి**



**వరంగల్ మహా;** శ్రీ ధన మైసమ్మ దేవాలయం, మెట్ల బావి అమ్మవారి వెండి పాదాల తయారీ లో భాగంగా శనివారం 10,016 రూపాయలను గలాటి ధనలక్ష్మి భరత్ కుమార్ బహుమతిగా ఇచ్చి అమ్మవారి పై ఉన్న తమ భక్తిని చాటుకున్నారు. వరంగల్ లోని శ్రీ ధన మైసమ్మ దేవాలయం, మెట్ల బావి, 34 డివిజన్, శివనగర్, అమ్మవారికి అరకిలో వెండితో పాదాలు చేయించాలని ఆలయ అధ్యక్షులు తోట సంధ్య బాబన్న నిర్ణయించారు. దీంతో చాలామంది భక్తులు దూర ప్రాంతాల నుండి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి దాతలుగా ముందుకు వస్తున్నారు. నేడు నాలుగు జెండాల వాస్తవ్యులు జగిత్యాలలో హెడ్ కానిస్టేబుల్ గా గలాటి భరత్ కుమార్ ధనలక్ష్మి పుణ్య దంపతులు అమ్మవారిని కోరిన కోరికను తీర్చినందుకుగాను తమ మొక్కులు చెల్లించు కోవడానికి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొని శ్రీ ధన మైసమ్మ అమ్మవారి వెండి పాదాలకు వెండి కి గాను 10,016 రూ. ఆలయ అధ్యక్షులు తోట బాబన్న కు అందజేయగా ఆ దంపతులను ఆలయ అధ్యక్షుడు తోట బాబన్న అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి శేష వస్త్రంతో సన్మానించారు. అనంతరం ఆలయ అధ్యక్షులు మాట్లాడుతూ మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో భక్తుల కోరికలను తీర్చే చల్లని తల్లి శ్రీ ధన మైసమ్మ అమ్మవారు అని ఆ తల్లి ఆశీస్సుల కోసం ఎంతోమంది భక్తులు చాలా దూరం నుండి వరంగల్ కు వచ్చి అమ్మవారిని దర్శించుకుని వారి ముక్కులు చెల్లించు కోవడం అంతేకాకుండా ఎంతోమంది భక్తులు అమ్మవారి వెండి పాదాల తయారీ కై దాతలుగా నిలవడం పట్ల అధ్యక్షులు ఆనందం వ్యక్తం చేస్తూ ఈ సందర్భంగా వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న గలాటి భరత్ కుమార్, ధనలక్ష్మి వారి కుటుంబ సభ్యులు హరీష్ కుమార్, ప్రేమ, చైత్ర శ్రీ , హిమ బిందు సతీష్ కుమార్, తనుశ్రీ, తన్వి వారి కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు వెంకన్న ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



## మార్లవాయి జీపీని సందర్శించిన నోడల్ అధికారి

**జైనూర్ మహా :** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలం మార్లవాయి గ్రామపంచాయతీని నోడల్ అధికారి శ్రీనివాస్ సందర్శించారు. ఆదివాసీ ఆత్మబంధువులు, విశిష్ట సేవలందించిన ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ - బెట్టి ఎలిజబెత్ దంపతులకు అధికారులు నివాళులు అర్పించారు. మ్యూజియం, డార్ఫ్ రీడింగ్ రూమ్, కాటేజ్‌లు ,పర్యాటక వసతి రూములను పరిశీలించి, అక్కడి సదుపాయాలపై అధికారులతో చర్చించారు. గ్రామపంచాయతీలే పల్లెలకు పట్టుకొమ్మలని మార్లవాయి గ్రామపంచాయతీ సుందరీకరణ, పచ్చదనం, అభివృద్ధి పనులు అభినందనీయమన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి అవార్డులు ప్రజాసేవలకు రావడం గర్వకారణమన్నారు. త్వరలో గ్రామపంచాయతీ సర్పంచులకు శిక్షణ కార్యక్రమాన్ని ఇదే గ్రామం నుంచే ప్రారంభిస్తామని నోడల్ అధికారి అన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో బిక్షపతి గౌడ్, ఎంపీవో శశికుమార్, సీనియర్ అసిస్టెంట్ మోహన్, గ్రామపంచాయతీ కార్యదర్శి మనోజ్ తో పాటు గ్రామస్తులు, యువజన సభ్యులు గేడం గణపత్, హన్మంత్ రావ్, సీతారామ్, తరుణ్, మాధవ్, భీము, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




## కేయూలో ఘనంగా వీర్ బాల్ దివస్ కార్యక్రమం

**వీర బాలల త్యాగాలు మరువలేనివి**
**కేయూ వీసీ ప్రో ప్రతాప్ రెడ్డి**

**హన్మకొండ మహా;** హనుమకొండ కాకతీయ యూనివర్సిటీ గోల్డెన్ జూబిలీ ఉత్సవాల్లో భాగంగా కాకతీయ యూనివర్సిటీ డీన్, స్టూడెంట్ ఎఫైర్స్, సోషలజీ, సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో శనివారం సెనేట్ హాల్ లో వీర్ బాల్ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులలో జాతీయ చైతన్యం, ధర్మ నిష్ఠను పెంపొందించేందుకు "వీర్ బాల్ దివస్, జాతి నిర్మాణం అనే అంశంపై వక్తృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకతీయ యూనివర్సిటీ గౌరవ ఉప కులపతి ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమాన్ని డాక్టర్ ఎం. స్వర్ణలత, హెడ్, సోషలజీ & సోషల్ వర్క్ విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, డీన్, స్టూడెంట్ ఎఫైర్స్, సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. డా స్వర్ణలత, ప్రో మామిడాల ఇస్తారీ మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో భాగంగా 136 మంది వివిధ కాలేజీల విద్యార్థులు వ్యాస రచన, వక్తృత్వ పోటీల కొరకు రిజిస్ట్రేషన్ చేసుకొని పాల్గొన్నారని తెలిపారు. వక్తృత్వ, వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు వీసీ ప్రో ప్రతాప్ రెడ్డి బహుమతులు అంద చేశారు.

# ఖాందేవ్ జాతర



- తొడసం వంశస్తుల దేవర
- సాంప్రదాయ బద్ధంగా పూజలు
- రెండున్నర కిలోల నువ్వుల నూనె తాగడం ఆనవాయితీ
- మొక్కు తీర్చుకున్న తొడసం ఆడపడుచు

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలో జరిగే ఖాందేవ్ జాతరకు ఓ చరిత్ర ఉంది. ఖాందేవ్ ఆలయంలో 18 ప్రతిమల సముదాయాన్ని ఖాందేవుడిగా, ఏనుగులను కుల దైవాలుగా ఆరాధిస్తుంటారు. పూర్వం 2023 నాటికి సుమారు 500 ఏళ్ల క్రితం కాకతీయుల కాలంలో తొడసం వంశీయులు యుద్ధంలో విజయం సాధించి నార్నూర్ కు వచ్చి జాతర జరుపుకున్నారని, అప్పటి నుండి ఈ జాతర పూర్వీకుల నుంచి తరతరాలుగా ఆదివాసీలకు సంప్రదాయంగా వస్తుంది. ధృవరాజులు వారి పాలనలో ఏనుగులను యుద్ధ సమయంలో ఉపయోగించేవారు. రాజ్యంలో ఏనుగులు ప్రజల పంటలను ధ్వంసం చేయడంతో పాటు ఇబ్బందులకు గురిచేయడంతో వాటిని పట్టు కోవడానికి రాజు బహుమతి ప్రకటన చేశారు. తొడసం వంశస్తులు ప్రస్తుతం గాదిగూడ మండలంలోని రోమనాకాసా (అప్పటి గోండ్వానా రాజ్యంలో ఉన్న ఎనికాసా) గ్రామం వద్ద ఏనుగులు నిద్రపోతున్న సమయంలో పట్టుకుని ఖందేవ్ పుణ్య క్షేత్రం సమీపంలో చింతచెట్టు వద్ద కట్టేశారట. దీంతో ఆత్రం వంశానికి చెందిన రాజు "సవ్వ చాలీస్" రాజ్యాన్ని తొడసం వంశానికి అప్పగించాడు. అప్పటి నుంచి ఏనుగును తొడసం వంశానికి విజయంగా భావిస్తూ ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గోండు తెగలోని తొడసం గోత్రం వంశీయులు పూజారులు గా ఉంటారు. అదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంల దశాబ్దాల నుంచి తొడసం వంశీయులు పుష్యమాసం పౌర్ణమి రోజున సంప్రదాయంగా కామదేవుని మహాపూజ నిర్వహించడం ఆనవాయితీ .ఆదివాసీల జాతిలో తొడసం వంశీయులు ఆరాధ్య దైవం ఖాందేవుడు కొలువై ఉన్న నార్నూర్ మండల కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి ఖాందేవుని జాతర ప్రారంభమైంది .ఖాందేవుని మహాపూజ నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. 15 రోజుల పాటు ఖాందేవుని సన్నిధిలో జాతర జరగడం ఆనవాయితీ .దశాబ్దాల నుంచి తొడసం వంశీయులు పుష్యమాసం పౌర్ణమి రోజు సంస్కృతి సంప్రదాయంగా ఖాందేవుని మహాపూజ నిర్వహించడం ఆనవాయితీ .

**నూనె మొక్కులు**

తొడసం వంశస్తుల ఆరాధ్య దైవమైన ఖాందేవునికి ఏటా పుష్య పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తారు. దేవునికి నైవేద్యం పెట్టేందుకు నెలరోజుల ముందే ఆదివాసీలు ఇంట్లో నువ్వులనూనె తయారుచేస్తారు.తొడసం వంశ ఆడపడుచు 2 కిలోల నువ్వుల నూనె తాగే మొక్కు మొక్కుతుంటారు.మూడేళ్లకోసారి ఒకరు మొక్కు చెల్లించడం ఆనవాయితీగా వస్తుంది. పుష్య మాసంలో నెలవంక కనిపించిన తరువాత తాము పండించిన నువ్వులను గానుగతో నూనె సేకరించి, ఖాందేవ్ మొక్కు కోసం ఒక్కొక్కరి ఇంటి నుంచి నువ్వుల నూనె తీసుకు వస్తారు. అలా తీసుకొచ్చిన నువ్వుల నూనెను ముందుగా ఖాందేవ్, పులి, ఏనుగు, దేవుళ్ళకు చూపించి, కటోడ పూజారి సమక్షంలో నైవైద్యం పెట్టి, నూనె మొక్కును ప్రారంభిస్తారు. తొడసం వంశంలో పుట్టిన ఆడపడుచు పెళ్లైన తరువాత ఇంటి పేరు మారినా ఆమె పుట్టిన వంశ ఆడపడుచుగానే మొక్కును చెల్లిస్తుంది. ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ గ్రామనికి చెందిన తొడసం వంశస్తుల ఆడపడుచు సుర్పం సక్రు బాయి రెండు కిలోల నువ్వుల నూనె తాగి మొక్కు తీర్చుకుంది. ఇలా మొక్కడం వలన సంతాన యోగం,కుటుంబంలో అందరికీ మంచి జరుగుతుందని వారి నమ్మకం. వందేళ్లుగా ఈ ఆచారం వస్తుందని, తొడసం ఆడపడుచులు మూడేళ్లకోసారి ఒకరు నువ్వుల నూనె తాగాల్సి ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కొత్తగా వివాహమైన తొడసం వధువులకు ఖాందేవ్ వద్ద భేటింగ్ కార్యక్రమం ఉంటుంది. ఈ జాతర ముగిసిన అనంతరం కేస్లాపూర్ నాగోబా జాతరను దర్శించుకుంటారు.

# ఘనంగా మహిళా ఉపాధ్యాయినుల దినోత్సవం

- జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్
- సావిత్రిబాయి పూలే సేవలు అభినందనీయం
- కేయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి



**హన్మకొండ మహా;** మహిళా ఉద్యోగినులు తమ సంపూర్ణ శక్తి, సామర్థ్యాలను విశ్వవిద్యాలయ అభివృద్ధిలో వినియోగిస్తున్నారని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ అండ్ ఎంపవర్మెంట్ సంచాలకులు డాక్టర్ దీపా జ్యోతి అధ్యక్షతన, శనివారం విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో నిర్వహించిన "మహిళా ఉపాధ్యాయినుల దినోత్సవ వేడుకలను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే గొప్ప సామాజిక సంస్కర్త అని, ఆమె చేసిన త్యాగాలు అమూల్యమైనవని అన్నారు. మహిళల కృషి సమాజ నిర్మాణంలో కీలకమని, వ్యక్తిత్వ వికాసంలో తల్లి తొలి గురువని తెలిపారు. తరగతి గది నిర్వహణలో ఉపాధ్యాయుడు-ఉపాధ్యాయిని మధ్య సున్నితమైన కానీ ప్రభావవంతమైన తేడా ఉంటుందని పేర్కొన్నారు. ఆనాటి పరిస్థితుల్లో మహిళా విద్య ద్వారానే సాధికారత సాధ్యమని గుర్తించిన దూరదృష్టి గల మార్గదర్శి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. నేటి మహిళా స్ఫూర్తికి ఆమెనే నాంది పలికారన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ మహిళలు మానసికంగా, భావోద్వేగపరంగా ఎంతో బలమైనవారని అన్నారు. నేటి పురుషులు మహిళలకు సహకరిస్తుండటం అభినందనీయమని అన్నారు. మైత్రి, గార్గి వంటి మహనీయ మహిళలను అందించిన దేశం భారతదేశమని చెప్పారు. అదే కోవకు చెందిన మహిళామూర్తి సావిత్రిబాయి పూలే అని, జ్ఞానం కలిగిన మహిళతోనే గొప్ప సమాజం నిర్మితమవుతుందని స్పష్టం చేశారు. వివక్ష, అణిచివేత ఉన్న కాలంలో మహిళా విద్య ద్వారా చైతన్యం నింపిన వ్యక్తి సావిత్రిబాయి పూలే అని తెలిపారు. నేటి మహిళలు సాంకేతికతను అత్యుత్తమంగా వినియోగించుకోవాలని సూచించారు. అడ్డంకులను అధిగమించినప్పుడే విజయం సాధ్యమని, లోపాలను సరిదిద్దుకుంటూ క్షమాగుణంతో ముందుకు సాగాలని అన్నారు. బాలిక విద్య వల్ల సమాజంలో గణనీయమైన మార్పులు వచ్చాయని,విద్యార్థుల్లో ప్రేరణ కోసం 'స్ఫూర్తి' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు. నేటి అధ్యాపకులపై గొప్ప బాధ్యత ఉందని, అధికారిణిగా అనేక సమస్యలను పరిష్కరించడం కూడా ఒక పెద్ద బాధ్యతే నని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆదర్శ మహిళ సావిత్రిబాయి పూలే..

**తలమడుగు మహా :** ఆడపిల్లల చదువు కోసం నిరంతరం పాటుపడిన మహిళ చైతన్య మూర్తి సావిత్రిబాయి పూలే అని సమాజంలో రుగ్మతలు రూపుమాపడానికి ఆమె విశేష కృషి చేసారని బ్లూ భీమ్ యూత్ సభ్యులు అన్నారు. సావిత్రిబాయి పూలే చరిత్ర ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. శనివారం తలమడుగు మండల కేంద్రంలోని బ్లూ భీమ్ యూత్ ఆధ్వర్యంలో మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఆమె జీవిత చరిత్ర ను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లూ భీమ్ యూత్ సభ్యులు అరవింద్ శివకృష్ణ ప్రసాద్ మహేందర్ ప్రశాంత్ ప్రవీణ్ శివమణి సందీప్ రాజు వినయ్ తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య పనులు పక్కాగా చేపట్టాలి

**ఎం హెచ్ ఓ డాక్టర్ ఎం రాజేష్**

**వరంగల్ మహా;** వరంగల్ నగరంలో జనవరి 11 12 13 వ తేదీలలో జరుగనున్న ఉర్సు దర్గా ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్గా ప్రాంగణం అంతయు పరిశుభ్రంగా ఉండడానికి మహా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపడతామని వరంగల్ మహానగర పాలక సంస్థ ఎంహెచ్ఓ డాక్టర్ ఎం రాజేష్ అన్నారు. శనివారం ఉర్సు దర్గా ప్రాంగణంలో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి తో కలిసి ఉర్సు దర్గా పీఠాధిపతి ఉబేద్ బాబా లతో కలిసి దర్గా ప్రాంగణాన్ని పరిశీలించారు. దర్గా ప్రాంగణంలో పెరిగిన పిచ్చి మొక్కలను, పారిశుద్ధ్య పనులను ఎంహెచ్ఓ తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మరుపల్ల రవి మాట్లాడుతూ ఉర్సు దర్గా ఉత్సవాలకు అనేక మంది మహిళలు పాల్గొంటారని వారికి మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, ఉత్సవాలు జరిగే సమయంలో చెత్తాచెదారం పడకుండా వెనువెంటనే శుభ్రం చేయడానికి సిబ్బందిని నియమించాలన్నారు.

# హాస్టల్ ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మార్వో

**వరంగల్ మహా;** ఖిలావరంగల్ మండలం మామునూర్ గ్రామంలో ని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ హాస్టల్ ని మండల ఎమ్మార్వో మహమ్మద్ ఇక్బాల్ ఆకస్మిక తనిఖీ చేశారు. వారితో కలిసి భోజనం చేసాడు. అక్కడ విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు.భోజనం విషయంలో ఎలాంటి ఫిర్యాదులు ఉన్న తనకి నేరుగా తెలియజేయాలని విద్యార్థులకు తెలిపారు.హాస్టల్ వార్డెన్ తో మాట్లాడి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని తెలిపారు.వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు ఎమ్మార్వో ఈ సందర్భంగా తెలిపారు.

# చైనా కంపెనీ దెబ్బకు.. వెనుకబడ్డ మస్క్ టెస్లా!




అమ్మకాల్లో అగ్రగామిగా కొనసాగిన అమెరికా కార్ల తయారీ దిగ్గజం టెస్లా డీలా పడింది. ఆటోమొబైల్ మార్కెట్లో పెరుగుతున్న పోటీ, సుంకాల ప్రభావం, మస్క్ రాజకీయ ఎత్తుగడలు అన్నీ.. టెస్లా అమ్మకాలను దెబ్బ తీశాయి. దీంతో బీవైడీ కంపెనీ అమ్మకాల్లో.. టెస్లాను అధిగమించి మొదటి స్థానం కైవసం చేసుకుంది. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ నేతృత్వంలోని టెస్లా కంపెనీ.. 2025 చివరి మూడు నెలల్లో 4,18,227 డెలివరీలను పూర్తి చేసింది. దీంతో ఏడాది మొత్తం విక్రయాలు 1.64 మిలియన్లుగా నమోదయ్యాయి. ఈ అమ్మకాలు 2024తో పోలిస్తే ఎనిమిది శాతం కంటే ఎక్కువ తగ్గుదలను సూచిస్తుంది. ఇదే సమయంలో బీవైడీ కంపెనీ.. గత సంవత్సరం 2.26 మిలియన్ ఎలక్ట్రిక్ వాహనాలను విక్రయించి ముందువరుసలో నిలిచింది.

**టెస్లా అమ్మకాలు తగ్గడానికి కారణం**

2024లో మస్క్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఆలింగనం చేసుకోవడం, ఆ తర్వాత ఫెడరల్ కార్మికులను విస్తృతంగా తొలగించడం వెనుక వివాదాస్పద "గవర్నమెంట్ ఎఫీషియన్సీ" ప్యానెల్ (DOGE)కు నాయకత్వం వహించడం కూడా భిన్నాభిప్రాయాలకు దారితీసింది. ఆ తరువాత చాలామంది పెద్ద ఎత్తున టెస్లా సౌకర్యాల వద్ద నిరసనలు తెలిపారు. ఇది కంపెనీ కార్ల అమ్మకాలపై గణనీయమైన ప్రభావం చూపింది.

**ధరలు**

మరో ప్రధానమైన కారణం ఏమిటంటే.. 'ధరలు'. బీవైడీ కంపెనీ చాలావరకు అఫర్డబుల్ మోడల్స్ విక్రయిస్తోంది. ఇందులో ఎలక్ట్రిక్ వాహనాలు, ప్లగ్ఇన్ హైబ్రిడ్ వాహనాలు ఉన్నాయి. అయితే టెస్లా కంపెనీ మాత్రం.. ప్రీమియం ఎలక్ట్రిక్ కార్లను విక్రయిస్తోంది. అంటే వీటి ధరలు చాలా ఎక్కువన్నమాట. ధరలు ఎక్కువగా ఉండటం వల్ల మధ్య తరగతి కొనుగోలుదారులు.. టెస్లా కార్లకు ప్రత్యామ్నాయంగా బీవైడీ కార్లను కొనుగోలు చేస్తున్నారు. చైనా ఆటోమొబైల్ మార్కెట్ గణనీయంగా వృద్ధి చెందింది. దీంతో బీవైడీ కంపెనీ అక్కడ అతిపెద్ద మార్కెట్ షేర్ కలిగి ఉంది. టెస్లా కంపెనీకి ఈ విషయంలో అంత పెద్ద వాటా లేదని తెలుస్తోంది. దీనివల్ల అక్కడ కూడా అమ్మకాలు తక్కువ. అమెరికాలో కూడా టెస్లా అమ్మకాలు మందగించాయి. యూరప్‌లో టెస్లాకి కొన్ని మార్కెటింగ్/పాలిసీ సమస్యలు ఎదురయ్యాయి.

**బీవైడీ విస్తరణ**

2003లో ప్రారంభమైన టెస్లా కంపెనీ.. ఎలక్ట్రిక్ వాహనాల అభివృద్ధి, అమ్మకాల్లో ముందువరుసలో కొనసాగుతూ వచ్చింది. అయితే దీనికి చైనా వాహన తయారీ సంస్థ బీవైడీ (బిల్డ్ యువర్ డ్రీమ్స్) సంస్థ ప్రధాన ప్రత్యర్థిగా నిలిచింది. బీవైడీ కంపెనీ చైనా మార్కెట్లో మాత్రమే కాకుండా.. యూరోప్, ఆసియా, లాటిన్ అమెరికా వంటి మార్కెట్లలో కూడా తన ఉనికిని వేగంగా విస్తరిస్తోంది. ఈ విషయంలో టెస్లా చాలా వెనుకబడి ఉంది.

# కియా సెల్టోస్ కొత్త వెర్షన్.. ధర ఎంతంటే?



నూతన సంవత్సర సందర్భంగా ప్రముఖ కార్ల తయారీ సంస్థ కియా కొత్త తరం సెల్టోస్‌ను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ ఎస్‌యూవీ ప్రారంభ ధర రూ.10.99 లక్షలుగా ఉంది. టాప్ ఎండ్ వేరియంట్ ధర రూ.19.99 లక్షల వరకు ఉంటుంది. హెచ్‌టీఈ, హెచ్‌టీఈ(ఓ), హెచ్‌టీకే, హెచ్‌టీకే (ఓ), హెచ్‌టీఎక్స్, హెచ్‌టీఎక్స్(ఏ), జీసీఎక్స్, జీఎస్ఎక్స్(ఏ), ఎక్స్-లైన్ వేరియంట్లలో లభిస్తుంది.ఇంజిన్ ఆప్షన్ల విషయానికి వస్తే, మూడు శక్తివంతమైన మోటార్‌లతో మార్కెట్లో ప్రవేశిస్తుంది. 1.5 లీటర్ పెట్రోల్ ఇంజిన్ 113బీహెచ్‌పీ పవర్‌ని అందిస్తుంది. మరో 1.5 లీటర్ టర్బో-పెట్రోల్ ఇంజిన్ 158బీహెచ్‌పీ పవర్‌తో డ్రైవింగ్ అనుభవాన్ని పంచుతుంది. 1.5 లీటర్ డీజిల్ ఇంజిన్ 118బీహెచ్‌పీ పవర్ ఇస్తుంది. ఈ ఇంజిన్‌లకు మ్యాన్యువల్, ఓఎంటీ, సీవీటీ, 7-స్పీడ్ డీసీటీ ఆటోమేటిక్ గేర్‌బాక్స్ ఆప్షన్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 6 ఎయిర్‌బ్యాగులు, లెవల్-2 ఏడీఏఎస్, ఈఎస్‌సీ, టీపీఎంఎస్(టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్), ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, 360-డిగ్రీ కెమెరా వంటి అత్యాధునిక భద్రతా ఫీచర్లున్నాయి. 1,830 మి.మీ. వెడల్పు, 1,635 మి.మీ. ఎత్తు, 2,690 మి.మీ. వీల్‌బేస్‌తో వస్తోంది. కారు లోపల 12.3 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, 12.3 అంగుళాల హెచ్‌డీ టచ్‌స్క్రీన్ సింగిల్ ప్యానెల్ విజువల్ కమాండ్ సెంటర్ ఉన్నాయి. ఫ్రంట్ వెంటిలేటెడ్ సీట్లు, 64 కలర్ యాంబియెంట్ మూడ్ లైటింగ్, డీ కట్ డ్యూయల్ టోన్ లెదర్ స్టీరింగ్ వీల్‌ను ఇచ్చారు. ఎనిమిది స్పీకర్లతో కూడిన బోస్ ప్రీమియం సౌండ్ సిస్టమ్, పనోరమిక్ సన్‌రూఫ్ సౌకర్యాలు కలిగి ఉంది. జనవరి రెండో వారం తర్వాత వీటి డెలివరీలు ప్రారంభమవుతాయని కంపెనీ వెల్లడించింది. రూ.25వేల టోకెన్ అమౌంట్‌తో డిసెంబర్ 11 నుంచి బుకింగ్స్ ప్రారంభించిన సంగతి తెలిసిందే.

# అంబానీ ఫ్యామిలీ: ఎవరెంత చదువుకున్నారంటే..

**భారతదేశంలో అత్యంత సంపన్నులైన అంబానీ ఫ్యామిలీ గురించి దాదాపు అందరికీ తెలుసు. అయితే ఈ కుటుంబం లో ఎవరు ఎంత చదువుకున్నారు?, అనే విషయం బహుశా చాలామందికి తెలిసి ఉండకపోవచ్చు. ఆ వివరాలను ఈ కథనంలో తెలుసుకుందాం.**

**ధీరూభాయ్ అంబానీ:** రిలయన్స్ గ్రూప్ వ్యవస్థాపకుడు ధీరూభాయ్ అంబానీ, 1933 డిసెంబర్ 28న గుజరాత్‌లోని జునాగఢ్ జిల్లాలో జన్మించారు. ఆయన పూర్తి పేరు ధీరూభాయ్ హీరాచంద్ అంబానీ. ధీరూభాయ్ ఉన్నత పాఠశాల వరకు మాత్రమే చదువుకున్నారు. ఆ తరువాత డబ్బు సంపాదించడానికి.. యెమెన్‌కు వెళ్లారు. ఇక్కడ పెట్రోల్ పంప్‌లో పనిచేశారు. రిలయన్స్ గ్రూప్‌కు పునాది వేసిన ధీరూభాయ్‌కు అంతకు ముందు పూర్వీకుల నుంచి వచ్చిన సంపద లేదు.

**ముఖేష్ అంబానీ:** రిలయన్స్ గ్రూప్ అధినేత ముఖేష్ అంబానీ ముంబైలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ నుంచి కెమికల్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రుడయ్యాడు. ఆ తరువాత ఎంబీఏ కోసం స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో చేరారు. కానీ ఎంబీఏ పూర్తి చేయకుండానే.. తన చదువును మధ్యలో వదిలివేసి 1980లో రిలయన్స్‌లో చేరడానికి భారతదేశానికి తిరిగి వచ్చారు.

**అనిల్ అంబానీ:** ముఖేష్ అంబానీ తమ్ముడు అనిల్ అంబానీ ముంబైలోని హిల్ గార్డెన్ స్కూల్ నుంచి పాఠశాల విద్య, ఆ తరువాత, కిషన్ చంద్ చెల్లారం కళాశాల నుంచి సైన్స్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. తరువాత 1983లో, పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం నుంచి ఎంబీఏ పట్టా పొందారు.

**నీతా అంబానీ:** ముఖేష్ అంబానీ భార్య.. నీతా అంబానీ ముంబైలోని నర్సీ మోంజీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఎకనామిక్స్ డిగ్రీ పూర్తి చేశారు. ఈమెకు నృత్యం, బోధన అంటే చాలా ఇష్టం. ఈ కారణంగానే నీతా అంబానీ.. ధీరూభాయ్ అంబానీ





ఇంటర్నేషనల్ స్కూల్ స్థాపించారు.

**టీనా అంబానీ:** అనిల్ అంబానీ భార్య.. నటి టీనా అంబానీ ముంబైలోని జై హింద్ కళాశాల నుంచి ఆర్ట్స్‌లో డిగ్రీ పూర్తి చేశారు. అంతే కాకుండా ఈమె లాస్ ఏంజిల్స్ నుంచి ఇంటీరియర్ డిజైనింగ్ అండ్ కంప్యూటర్ సైన్స్‌లో డిగ్రీ పూర్తి చేయారు.

**ఆకాష్ అంబానీ:** ఆకాష్ అంబానీ ముంబైలోని ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి పాఠశాల విద్యను.. ఆ తర్వాత, 2013లో అమెరికాలోని బ్రౌన్ యూనివర్సిటీ నుంచి ఎకనామిక్స్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆకాష్ ఇప్పుడు తన తండ్రికి తన వ్యాపారంలో సహాయం చేస్తున్నాడు.

**శ్లోకా మెహతా అంబానీ:** ముఖేష్ అంబానీ పెద్ద కోడలు శ్లోకా మెహతా.. న్యూజెర్సీలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ నుంచి ఆంత్రోపాలజీలో పట్టభద్రురాలైంది. అంతే కాకుండా ఈమె లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి న్యాయశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు.

**ఇషా అంబానీ:** ముఖేష్ అంబానీ కుమార్తె ఇషా అంబానీ.. 2014లో అమెరికాలోని యేల్ విశ్వవిద్యాలయం నుంచి సైకాలజీ.. ఆ తరువాత కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం నుంచి ఎంబీఏ పట్టా పొందారు.

**అనంత్ అంబానీ:** అనంత్ అంబానీ ముంబైలోని ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి పాఠశాల విద్యను, తరువాత బ్రౌన్ విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఇప్పుడు అనంత్ అంబానీ జియో ప్లాట్‌ఫామ్స్ బోర్డులో అదనపు డైరెక్టర్‌గా ఉన్నారు.

**రాధిక మర్చంట్ అంబానీ:** ముఖేష్ అంబానీ చిన్న కోడలు రాధిక మర్చంట్ ముంబైలోని ఎకోల్ మోండియేల్ వరల్డ్ స్కూల్, బీడీ సోమానీ ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి పాఠశాల విద్య.. తరువాత 2017లో న్యూయార్క్ విశ్వవిద్యాలయం నుంచి రాజకీయాలు & ఆర్థిక శాస్త్రంలో పట్టభద్రురాలయ్యారు.

**జై అన్మోల్ అంబానీ:** అనిల్ అంబానీ పెద్ద కుమారుడు జై అన్మోల్ ముంబైలోని కేథడ్రల్ అండ్ జాన్ కానన్ స్కూల్ నుంచి పాఠశాల విద్యను, ఆ తరువాత యూకేలోని వార్విక్ బిజినెస్ స్కూల్ నుంచి పట్టభద్రుడయ్యాడు.

**క్రిషా షా అంబానీ:** జై అన్మోల్ భార్య.. అనిల్ అంబానీ కోడలు క్రిషా షా కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం నుంచి రాజకీయ ఆర్థిక శాస్త్రంలో పట్టభద్రురాలయ్యారు. దీనితో పాటు, ఆమె లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి డిగ్రీ కూడా పొందారు.

**జై అన్షుల్ అంబానీ:** అనిల్ అంబానీ చిన్న కుమారుడు జై అన్షుల్ అంబానీ ముంబైలోని కేథడ్రల్ అండ్ జాన్ కానన్ స్కూల్ నుంచి పాఠశాల విద్యను పూర్తి చేశారు. ఆ తరువాత, అతను NYU స్టెర్న్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నుంచి బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ పొందాడు.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# అస్సాంలో హ్యాట్రిక్ విజయం దిశగా బీజేపీ

## ఎన్‌డీఏ కూటమి 90 సీట్ల మార్క్‌ను తాకే అవకాశం- పీపుల్స్ పల్స్ సర్వే

ఈ ఏడాది జరగబోయే అస్సాం శాసనసభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) వరుసగా మూడోసారి అధికారాన్ని సాధించే దిశగా దూసుకెళ్తోందని పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ నిర్వహించిన తాజా ట్రాకర్ పోల్ వెల్లడిరచింది. 2025 నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు నిర్వహించిన ఈ సర్వే ప్రకారం, మొత్తం 126 స్థానాలు ఉన్న శాసనసభలో బీజేపీ 6974 సీట్లు గెలుచుకొని మెజారిటీ సాధించే అవకాశముంది. ఎన్‌డీఏ భాగస్వాములతో కలిపితే మొత్తం సీట్లు 90 మార్క్‌ను తాకే అవకాశం ఉందని తేలింది. ప్రతిపక్షంలో ఐక్యత లేని పరిస్థితుల్లో బీజేపీకి ఇది కలిసి వస్తోందని సర్వేలో వెల్లడయ్యింది. వ్యూహాత్మక పొత్తులు, సంక్షేమ పథకాలు, అన్ని వర్గాల మద్దతుతో అస్సాంలో బీజేపీ పట్టు కొనసాగుతోంది. ఈ సర్వే పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ డైరెక్టర్, పొలిటికల్ ఎనలిస్ట్ డా. రాజన్ పాండే నేతృత్వంలో నిర్వహించడం జరిగింది. ‘‘ఈ ట్రాకర్ పోల్ ప్రస్తుత సమయంలో అస్సాం ఓటర్ల మనోభావాలను ప్రతిబింబిస్తోంది. అధికార ప్రయోజనాలకే పరిమితం కాకుండా విభిన్న వర్గాలతో బీజేపీకి బలమైన అనుసంధానం ఏర్పడినట్లు ఈ సర్వే స్పష్టం చేస్తుంది. ముఖ్యంగా ఏఐయుడీఎఫ్, యూపీపీఎల్ వంటి పార్టీలు మనుగడకే పోరాడుతున్న నేపథ్యంలో ఎన్‌డీఏ విజయం నల్లేరు మీద నడకలా కనిపిస్తోంది’’.





**బీజేపీకి స్పష్టమైన ఆధిక్యం**

పీపుల్స్ పల్స్ ట్రాకర్ పోల్ అంచనా ప్రకారం బీజేపీ 6974 సీట్లతో అగ్రస్థానంలో నిలవనుంది. కాంగ్రెస్‌కు 2529 సీట్లు మాత్రమే వచ్చే అవకాశం ఉంది. ఎన్‌డీఏ మిత్రపక్షాలైన అసోం గణ పరిషత్ (ఏజీపీ)కు 811 సీట్లు, బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బీపీఎఫ్)కు 810 సీట్లు వచ్చే అవకాశం ఉంది. చిన్న పార్టీలు చాలా వెనుకంజలో ఉన్నాయి. ఏఐయుడీఎఫ్ 02, యూపీపీఎల్ 02, రైజర్ దళ్ 12, అస్సాం జాతీయ పరిషత్ (ఏజేపీ) 01, సీపీఐ(ఎం) 01, స్వతంత్రులు/ఇతరులు 01 గెలిచే అవకాశం ఉంది. మ్యాజిక్ ఫిగర్ 64 సీట్ల మెజారిటీకి ఎన్‌డీఏ చాలా ఆధిక్యంలో నిలుస్తోంది. బీజేపీ మూడోసారి ఏకపక్షంగా ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఇది రాష్ట్రంలో కాంగ్రెస్ గతంలో సాధించిన మూడు వరుస విజయాల సరసన నిలుస్తుంది. బీజేపీ తన కోర్ ఓటు బ్యాంకును నిలబెట్టుకుంటూనే కొత్త వర్గాల్లోకి విస్తరించగలగడమే దీనికి కారణమని ఈ ట్రాకర్ పోల్ సర్వేలో తేలింది. ఓట్ షేర్ విషయానికి వస్తే బీజేపీకి 39%, కాంగ్రెస్‌కు 37% వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఓట్ల శాతంలో తేడా తక్కువే ఉన్నప్పటికీ... అస్సాంలోని ఉత్కంఠ ఎన్నికల వాతావరణంలో ఇది సీట్ల పరంగా గణనీయమైన తేడాకు కారణం కావొచ్చు. ఇతర పార్టీల ఓట్ షేర్లు చూస్తే... ఏజీపీ 7%, బీపీఎఫ్ 5.5%, యూపీపీఎల్ 1.2%, ఏఐయుడీఎఫ్ 2.5%, రైజర్ దళ్ 0.9%, ఏజేపీ 0.7%, సీపీఐ(ఎం) 0.8%, ఇతరులు 5% ఓట్లు పొందే అవకాశం ఉంది. ఏఐయుడీఎఫ్ నుంచి ముస్లిం ఓటర్లు కాంగ్రెస్ వైపు మళ్లడంతో కాంగ్రెస్ ఓట్ షేర్ పెరిగిందని, అయితే డీలిమిటేషన్, ఎన్‌డీఏ సామాజిక కూటములు, బలహీన ప్రతిపక్ష భాగస్వాములు కారణంగా తన ఓటు బ్యాంకును సీట్లుగా మార్చుకోవడంలో కాంగ్రెస్ వెనుకబడుతోందని ఈ సర్వేలో వెల్లడయ్యింది.

**కాబోయే ముఖ్యమంత్రి ఎవరు?**

తదుపరి ముఖ్యమంత్రి ఎవరైతే బాగుంటుందని అడిగినప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మకు 30% మద్దతుతో స్వల్ప ముందంజలో ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రి సర్బానంద సోనోవాల్‌కు 28%, కాంగ్రెస్ ఎంపీ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గోగోయ్‌కు 27% ఓటర్లు మద్దతిచ్చారు. దేబబ్రత సైకియా 3%, హగ్రామా మోహిలారి 1%, అతుల్ బోరా 1%, దిలీప్ సైకియా 1%, బద్రుద్దీన్ అజ్మల్ 1%, అఖిల్ గోగోయ్ 1% తో వెనకంజలో ఉన్నారు. 7% మంది ఓటర్లు తాము ఇంకా నిర్ణయించుకోలేదని చెప్పారు. గౌరవ్ గోగోయ్ వ్యక్తిగత ప్రజాదరణ, సీఎం రేసులో ముందంజలో ఉన్నప్పటికీ, అది కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా మారలేదు. హిమంత బిశ్వ శర్మ స్వల్ప ఆధిక్యానికి మహిళా ఓటర్ల బలమైన మద్దతు తోడైంది. గిరిజనులు, పురుషులు ఎక్కువమంది సోనోవాల్ వైపు మొగ్గు చూపించారు.

**బీజేపీకే మద్దతు**

అస్సాం రాష్ట్ర అభివృద్ధికి ఏ పార్టీ మంచిదన్న ప్రశ్నకు 48% బీజేపీకి, 38% కాంగ్రెస్‌కు మద్దతు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఎవరు ప్రభుత్వం ఏర్పాటు చేస్తారు అన్న ప్రశ్నకు 55% బీజేపీ గెలుస్తుందని భావించగా, కాంగ్రెస్‌కు 40% మంది మద్దతు తెలిపారు. మరోసారి అవకాశం ఇవ్వాలన్న ప్రశ్నకు 55% బీజేపీకి అనుకూలంగా, 45% వ్యతిరేకంగా స్పందించారు. అభివృద్ధి, సంక్షేమం, వివిధ వర్గాల మద్దతు, సీఎం ఎంపిక, పార్టీ ప్రదర్శన, వయస్సు, లింగ పరమైన అంశాల్లో బీజేపీ సమగ్ర ఆధిక్యం కనిపించింది. 2021 నుంచి జరిగిన మండలాలు, పంచాయతీలు, మున్సిపాలిటీలు, వివిధ ఉపఎన్నికలతో పాటు 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఆధిక్యం కనబరుస్తూ రావడం ఆ పార్టీని మరింత బలోపేతం చేశాయి. గిరిజనులు, ఓబీసీల్లో కూడా మద్దతు సంపాదించి, ఎన్‌డీఏ తన పరిధిని మరింత విస్తరించింది. కాంగ్రెస్‌కు లభించిన స్వల్ప మద్దతు కూడా ప్రధానంగా బరాక్ వ్యాలీ, లోయర్ అస్సాంలో ఏఐయుడీఎఫ్ నుంచి ముస్లిం ఓటర్లు మారడం వల్లనే అని సర్వేలో తేలింది. వ్యాపార ప్రయోజనాలు, వివాదాస్పద కూటములపై అభిప్రాయాలతో ఏఐయుడీఎఫ్ రాజకీయంగా ఒంటరిగా మారింది. ఏజీపీ బీజేపీపై ఆధారపడుతోంది. కూటమి లేకుండా దాని పునాదులు క్షీణిస్తున్నాయి. యూపీపీఎల్ ఇటీవల బీటీఏడీ ఎన్నికల్లో బలహీన ప్రదర్శనతో మనుగడ సమస్యను ఎదుర్కొంటోంది. బోడో ఓటర్లు తిరిగి బీపీఎఫ్ వైపు మళ్లారు. బీజేపీబీపీఎఫ్ పునఃసమ్మేళనం బీటీఏడీ ప్రాంతాల్లో క్లీన్ స్వీప్‌కు దారులు వేస్తున్నాయి. రైజర్ దళ్, ఏజేపీ వంటి చిన్న పార్టీలు పరిమిత ప్రభావంతోనే ఉన్నాయి.

**ఏ కులం ఎటువైపు?**

కులాల పరంగా చూస్తే... అస్సామీలు ప్రధానంగా బీజేపీకి మద్దతు ఇస్తున్నారు. కొంతమంది కాంగ్రెస్‌తో పాటు ప్రాంతీయ పార్టీలకు మద్దతిస్తున్నారు. అహోములు సివసాగర్, జోర్హాట్ వంటి కొద్ది ప్రాంతాలు మినహా అన్ని ప్రాంతాల్లో బీజేపీ ఆధిక్యత కనబరుస్తోంది. ఇతర ఓబీసీలు కూడా బీజేపీకే అనుకూలంగా ఉన్నారు. సీఏఏ తర్వాత హిందూ బెంగాలీలు బీజేపీకి మద్దతు ఇస్తున్నారు. ముస్లింలు అధికంగా కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తూ ఏఐయుడీఎఫ్‌ను తిరస్కరిస్తున్నారు. గిరిజనుల్లో ఎన్‌డీఏ పట్ల ఆకర్షణ రోజురోజుకు పెరుగుతుండగా... బోడోలు బీపీఎఫ్‌బీజేపీకి, మిసింగ్స్, కార్బీలు, డిమాసాలు తదితరులు కూడా బీజేపీకి అనుకూలంగా ఉన్నారు. సంక్షేమ పథకాల వల్ల కొంతవరకు టీ తోటల సమూహాలు బీజేపీతోనే ఉన్నప్పటికీ, వారిలో కొంత అసంతృప్తి కనిపిస్తోంది.

**ప్రాంతాల వారీ విశ్లేషణ**

బరాక్ వ్యాలీ (13 సీట్లు): డీలిమిటేషన్ తర్వాత ముస్లిం ప్రభావం తగ్గడంతో ఎన్‌డీఏకు 810 సీట్లు వచ్చే అవకాశం ఉంది. అప్పర్ అస్సాం: ఎన్‌డీఏ ఆధిక్యంగా ఉండగా, ప్రతిపక్షానికి కొన్ని సీట్లు వచ్చే అవకాశం ఉంది. మిడిల్ అస్సాం: గిరిజన ప్రాంతాల్లో ఎన్‌డీఏ బలంగా ఉందిబీ కొన్ని జిల్లాల్లో ఇరు కూటములు పోటాపోటీగా తలపడుతున్నాయి. లోయర్ అస్సాం: డీలిమిటేషన్ ఎన్‌డీఏకు అనుకూలంగా మారడంతో బీజేపీబీపీఎఫ్ బీటీఏడీ కలిసి స్వీప్ చేసే అవకాశం ఉంది.

**డీలిమిటేషన్ `ప్రతిపక్ష సమస్యలు**

2023 డీలిమిటేషన్ బీజేపీకి అనుకూలంగా మారింది. ఈ చర్యతో ముస్లిం ఓట్లను చీల్చడం సులభమైంది. కాంగ్రెస్ పార్టీ అంతర్గత విభేదాలు, అభ్యర్థుల కొరతతో ఇబ్బంది పడుతోంది. ఏఐయుడీఎఫ్ పతనం కొనసాగుతోంది. బీజేపీ సంస్థాగత బలం, సంక్షేమ లబ్ధిదారుల వర్గం దాని స్థితిని మరింత బలపరుస్తున్నాయి. హింస, ప్రముఖుల మరణాలు, ఎస్టీ డిమాండ్లు, ఉద్యోగాలు, ద్రవ్యోల్బణం వంటి అంశాలు బీజేపీ నెరెటివ్ ని దెబ్బతీయలేకపోయాయి. సంక్షేమంపై ఉన్న భావనలే పైచేయిగా నిలిచాయి. బీజేపీ బలంగా పాతుకుపోవడంతో వరుసగా మూడో విజయాన్ని సాధించే అవకాశాలు సుగమయ్యాయి.

**సర్వే విధానం**

క్షేత్రస్థాయి రాజకీయ, ఎన్నికల పరిశోధనలో అనుభవం కలిగి ఉన్న పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ, ‘‘పర్పసివ్ స్ట్రాటిఫైడ్ రాండమ్ శాంప్లింగ్’’ మోడల్‌తో 45 రోజులపాటు అస్సాం వ్యాప్తంగా విస్త ృతంగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించింది. అప్పర్ అస్సాం, బరాక్ వ్యాలీ, మధ్య అస్సాం, లోయర్ అస్సాం అనే నాలుగు ప్రధాన ప్రాంతాలు, రాష్ట్రంలోని ఐదు పరిపాలనా విభాగాలు, మొత్తం 35 జిల్లాల్లో ఈ సర్వే జరిగింది. రాబోయే శాసనసభ ఎన్నికలకు సుమారు నాలుగు నెలల ముందే క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే క్రమంలో పీపుల్స్ పల్స్ రీసర్చర్లు అస్సాంలో 5,000 కిలోమీటర్లకు పైగా ప్రయాణించారు. 20 మందితో పీపుల్స్ పల్స్ బ ృందాన్ని ప్రతి గ్రూపులో నలుగురు రీసర్చర్ల చొప్పున నాలుగు గ్రూపులుగా విభజించాం. అదనంగా ఒక గ్రూపు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి సమగ్ర వివరాలు సేకరించింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3 నుంచి 4 రోజులు గడుపుతూ అన్ని వర్గాల ప్రజలను కలిశారు. 126 నియోజకవర్గాల్లో ప్రతి చోట 4045 నమూనాలను ముఖాముఖి ఇంటర్వ్యూల ద్వారా సేకరించారు. మొత్తం 5,000 మంది నుంచి సమాచారం సేకరించి, కులం, మతం, వయస్సును పరిగణలోకి తీసుకుంటూ పురుషులుమహిళలకు సమాన ప్రాతినిధ్యం ఇస్తూ క్షేత్రస్థాయి వాస్తవాలు ప్రతిబింబించేలా ఈ నమూనా రూపొందించాం. ప్రతి గ్రూపులో ఒకరు నియమిత ప్రశ్నావళితో ఇంటర్వ్యూలు నిర్వహించగా, మిగిలిన ముగ్గురు స్వేచ్ఛగాసంభాషణలు సాగిస్తూ మూడ్ సర్వే నిర్వహించారు.



# బలూచిస్తాన్‌పై చైనా కన్నుపడిందా?

విదేశీ భూభాగాలపై కన్నేయడం చైనాకు పరిపాటి. అది పొరుగు దేశమైతే చైనా చర్యలు మరీ అతిగా ఉంటాయి. ఈ క్రమంలోనే వేరే దేశం భూభాగాన్ని తమ మ్యాప్‌లో కూడా చూపించడానికి చైనా వెనుకాడదు. ముందు ఒక రాయి వేసి.. తర్వాత ఏం జరుగుతుందో చూస్తుంది. భారత్‌లోని అరుణాచల్ ప్రదేశ్‌ని పదే పదే చైనా తమ భూభాగంలో చూపించడం ఒక ఉదాహరణ. అయితే ఇక్కడ భారత్ బలమైన దేశం అనేది ఒకటైతే, ఇప్పుడు చైనాకు భారత్ సాయం అవసరం ఉంది కాబట్టి వారు ఎటువంటి దుస్సాహసానికి పాల్పడటం లేదు. గత కొన్నేళ్లుగా భారత్‌పై దూకుడుగా ఉండే విషయంలో చైనా ఆచితూచి వ్యవహరిస్తోంది. అదే సమయంలో భారత్‌తో సత్సంబంధాలు కొనసాగిస్తున్న చైనా.. ఇప్పుడు వేరే దేశాలపై పడింది. అందులో ఒకటి రష్యా అయితే, మరొకటి పాకిస్తాన్. కొన్ని రోజుల క్రితం రష్యా భూభాగాన్ని తమ మ్యాప్‌లో చూపించిన చైనా.. ఇప్పుడు పాకిస్తాన్‌ను టార్గెట్ చేసింది. చైనాకు పాకిస్తాన్ మిత్రదేశమే కానీ, అవకాశం వస్తే తమకు మిత్రులు, శత్రువులు ఎవరూ ఉండరనే నైజం చైనాది. ఆ క్రమంలోనే పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ భూభాగంపై చైనా కన్నేసినట్లు కనబడుతోంది. ఎప్పట్నుంచో పాకిస్తాన్ నుంచి విడిపోవాలని కోరుకుంటున్న బలూచిస్తాన్.. సుదీర్ఘ పోరాటం చేస్తుంది. తమ హక్కులను పాకిస్తాన్ కాలరాస్తుందని, అందుకు తమకు ప్రత్యేక దేశం కావాలనే డిమాండ్ ఎక్కువైంది.

**పాక్‌పై ప్రేమా..యురేనియం నిల్వలే టార్గెటా?**

బలూచిస్తాన్‌లో యురేనియం నిల్వలు ఉన్నాయనేది కొన్ని నివేదికలు స్పష్టం చేస్తున్న తరుణంలో చైనా ఆచితూచి ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తుంది. పాకిస్తాన్‌కు సైనిక సాయం పేరుతో ముందుగా వారి భూభాగంలోకి ప్రవేశించాలని చైనా కుట్ర రాజకీయాలకు పాల్పడే అవకాశం ఉందని కొందరు నిపుణులు అంటున్నారు. అందిందే జుట్టు.. అందకపోతే స్నేహం అనేది చైనా వైఖరి. ఇప్పుడు భారత్ విషయంలో చైనా అదే చేస్తుంది. మరి పాకిస్తాన్ విషయంలో చైనా అలా ఎందుకు ఆలోచించదని నిపుణులు చెబుతున్న మాట,. ప్రస్తుతం పాకిస్తాన్‌క సైనిక సాయం పేరుతో చైనా ఒక అడుగు ముందకేసి, ఆ తర్వాత మిగతాది చూసుకోవచ్చనే దృష్టితో ఉందని అంటున్నారు.

**బలూచిస్తాన్‌లో యురేనియం నిల్వల పరిస్థితి**

బలూచిస్తాన్‌లో యురేనియం నిల్వలు ఉన్నాయని పలు నివేదికలు సూచిస్తున్నాయి. ఇవి చైనాపాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ (CPEC) ప్రాజెక్టులకు కూడా భద్రతా, భౌగోళిక రాజకీయ పరంగా ప్రభావం చూపుతున్నాయి.ప్రపంచ స్థాయి యురేనియం నిల్వల జాబితాలో పాకిస్తాన్ పేరు ఉన్నప్పటికీ, బలూచిస్తాన్‌లోని నిల్వల ఖచ్చితమైన పరిమాణం అంతర్జాతీయ నివేదికల్లో స్పష్టంగా ఇవ్వబడలేదు. ఈ వనరుల కారణంగా స్థానిక ప్రజల్లో భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం రాజకీయ అస్థిరత కారణంగా తవ్వకాలు, వినియోగం కష్టతరంగా మారాయి. ఓవరాల్‌గా చూస్తే ఈ వనరులు పాకిస్తాన్‌కు వ్యూహాత్మకంగా ముఖ్యమైనవి. చైనా పెట్టుబడులు, స్థానిక అసంతృప్తి, మరియు అంతర్జాతీయ ఆసక్తి కారణంగా ఇవి సున్నితమైన అంశంగా మారాయి.

**బలూచిస్తాన్ నేతల్లో అదే ఆందోళన..**

ప్రస్తుతం బలూచిస్తాన్ నేతల్లో అదే ఆలోచన ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఒకవైపు పాకిస్తాన్‌తో పోరాడటానికే తాము ఆపసోపాల పడుతుంటే, మరొకవైప చైనా గోల ఏమిటో వారికి అంతుపట్టడం లేదు. తమ భూభాగంలోకి చైనా సైనిక దళాలు వస్తాయనే కచ్చితమైన సమాచారంతోనే వారు భారత్ సాయాన్ని అభ్యర్థిస్తున్నారు. అందుకోసమే భారత్ సాయాన్ని పదే పదే కోరుతున్నారు. అయితే బలూచిస్తాన్‌కు సాయం విషయంలో భారత్ ఎటువంటి నిర్ణయం తీసుకోలేకపోవచ్చు. ఎందుకంటే బలూచిస్తాన్‌ను కూడా పూర్తిగా నమ్మలేం. అసలే ఉగ్రవాద మూలాలున్న బలూచిస్తాన్‌కు సాయం చేస్తే తర్వాత భారత్‌కు విపత్కర పరిస్థితుల ఏర్పడవచ్చు.



# తలైవర్ 173 షురూ..

దశాబ్దాల తర్వాత ఇండియన్ సినిమా హిస్టరీలో భారీ కాంబినేషన్ రాబోతుంది. సూపర్ స్టార్ రజనీకాంత్, లోకనాయకుడు కమల్ హాసన్ మళ్ళీ జతకట్టబోతున్న విషయం తెలిసిందే. కమల్ హాసన్ స్వయంగా తన 'రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్' బ్యానర్‌పై రజనీకాంత్ హీరోగా సినిమాను నిర్మిస్తుండటం విశేషం. తొలుత ఈ ప్రాజెక్ట్ కోసం సుందర్ సి.పేరు వినిపించినప్పటికీ ఇప్పుడు 'డాన్' ఫేమ్ సిబీ చక్రవర్తి మెగాఫోన్ పట్టనున్నారు. రజనీకాంత్ మార్క్ మ్యానరిజమ్స్, సిబీ స్టైల్ కామెడీ అండ్ ఎమోషన్స్ ఈ సినిమాకు ప్రధాన బలం కానున్నాయి. కమల్ హాసన్ మరియు ఆర్. మహేంద్రన్ ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రజనీకాంత్ కెరీర్‌లో ఇది 173వ సినిమా కావడం విశేషం. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. 'ప్రతి వీరుడి వెనుక ఒక కుటుంబం ఉంటుంది'(Every HERO has a FAMILY) అనే ట్యాగ్ లైన్‌తో ఈ సినిమా రాబోతుంది. ఈ చిత్రాన్ని 2027 పొంగల్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.




# మరో 9 రోజుల్లో మెగా మేనియా..

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నచిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. సంక్రాంతికి వస్తున్నాం వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. మెగాస్టార్ చిరంజీవి, నయనతార ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12, 2026న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. దీంతో వరుసగా ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది చిత్రయూనిట్. ఇప్పటికే పాటలను విడుదల చేసిన చిత్రయూనిట్.. జనవరి 04న ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. అయితే తాజాగా ఈ సినిమా విడుదలకు ఇంకా 9 రోజులు ఉందని తెలుపుతూ కౌంట్‌డౌన్ పోస్టర్‌ను పంచుకుంది. ఈ పోస్టర్‌లో చిరంజీవితో పాటు అమృతం ఫేమ్ హర్షవర్ధన్, హీరోయిన్ కేథరిన్, అభినవ్ గోమఠం ఉన్నారు.

# డబ్బుని అమితంగా ప్రేమిస్తా!

నటనతో ఇంప్రెస్ చేస్తూనే అందంతో ఆకట్టుకునే పాత్రలు కథానాయికలకు అరుదుగా దొరుకుతాయి. 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' సినిమాలో కాయాదు లోహర్ పోషించింది ఆ తరహా పాత్రే. త్వరలో విశ్వక్‌సేన్ 'ఫంకీ' సినిమాతో ఈ అస్సాం చిన్నది తెలుగు ప్రేక్షకులను పలకరించనున్నది. ఇందులో పాత్ర కూడా అటు అందం, ఇటు అభినయం మేళవింపుగా ఉంటుందని చెబుతున్నది కాయాదు లోహర్. ఇటీవల ఈ పాత్ర గురించి ఆమె మాట్లాడుతూ 'ఇది సినిమా నేపథ్యంతో కూడిన కథ. ఇందులో నేను నిర్మాత కూతురుగా కనిపిస్తా. నా క్యారెక్టర్ పేరు చిత్ర. తండ్రి డబ్బుని ఆదా చేయాలని ఆశించే కూతురు పాత్ర. అంతేకాదు, మనీ మేనేజ్మెంట్ గురించి తను ఎక్కువగా మాట్లాడుతుంటుంది. డబ్బుని అమితంగా ప్రేమిస్తుంది. నిజంగా విభిన్నమైన పాత్రని చెప్పొచ్చు. విశ్వక్ ఇందులో డైరెక్టర్‌గా కనిపిస్తారు. మా ఇద్దరి కాంబినేషన్ సీన్స్ వినోదాత్మకంగా ఉంటాయి. దర్శకుడు అనుదీప్ రాసుకున్న కథలోనే తెలియని ఫన్ ఉంది. అదేంటో రేపు మీరు థియేటర్లలో చూస్తారు' అని తెలిపింది కాయాదు లోహర్. ఫిబ్రవరి 13న ప్రేమికుల రోజు కానుకగా ఈ సినిమా విడుదల కానున్న విషయం తెలిసిందే.





# సోఫాలో నగ్నంగా యంగ్ హీరో..

పలు చిత్రాల్లోనూ... వెబ్ సిరీస్‌ల్లోనూ కథానాయకుడిగానూ, కీలక పాత్రల్లోనూ నటించి టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు చైతన్యరావు. ఒకవైపు హీరోగా నటిస్తూనే..మరోవైపు స్టార్ హీరోల సినిమాల్లో కీలక పాత్రలు పోషిస్తున్నాడు. ఆ మధ్య రిలీజైన అనుష్క 'ఘాటీ' సినిమాలో విలన్‌గానూ నటించి మెప్పించాడు. త్వరలోనే ఈ విలక్షణ నటుడు మరో డిఫరెంట్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. కె.క్రాంతి మాధవ్ దర్శకత్వంలో ఆయన హీరోగా నటిస్తున్న చిత్రం 'దిల్ దియా'. 'ఏ నేకెడ్ ట్రూత్' అనేది ట్యాగ్ లైన్. శ్రియాస్ చిత్రాస్, ఎ పూర్ణ నాయుడు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై పూర్ణ నాయుడు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. చిత్రీకరణ జరుపుకుంటోన్న ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా (ప్రస్తుతం ప్రభాస్‌తో 'స్పిరిట్' మూవీ తెరకెక్కిస్తున్నాడు) విడుదల చేసి చిత్ర యూనిట్‌ను అభినందించారు. ఫస్ట్ లుక్, టైటిల్ పోస్టర్‌ను గమనిస్తే..దుస్తులు లేకుండా సోఫాలో కూర్చున్న చైతన్య రావును చూడొచ్చు. తను రగ్డ్ లుక్‌తో స్క్రీన్‌ను సీరియస్‌గా చూస్తున్నాడు. వెనుక నుంచి ప్రొజెక్టర్ లైటింగ్ వస్తోంది. తన చూపుల్లోని ఇంటెన్సిటీ తన పాత్రలోని సీరియస్‌నెస్‌ను తెలియజేస్తోంది. కథలోని విషయాలను రివీల్ చేయకుండా , పాత్రలు వాటికి కావాల్సిన నిజాన్ని వెతుక్కుంటూ సాగే కథగా ఈ సినిమా ఉంటుందనే ఫీల్ కలుగుతుంది ఈ సందర్భంగా... చిత్ర నిర్మాత పూర్ణ నాయుడు మాట్లాడుతూ ''డిఫరెంట్ కాన్సెప్ట్స్, సెన్సిబుల్ సినిమాలతో ప్రేక్షకులను మెప్పించిన దర్శకుడు క్రాంతి మాధవ్‌గారు.. మరోసారి 'దిల్ దియా'తో సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించటానికి సిద్ధమవుతున్నారు. చైతన్యరావు మదాడిని న్యూ అవతార్‌లో చూడబోతున్నారు. రా ఎమోషన్స్‌ను అందరికీ కనెక్ట్ అయ్యేలా రూపొందిస్తున్నాం. ప్రేమ, మమకారం, వైఫల్యం, స్వీయ గౌరవం వంటి ఎలిమెంట్స్‌ను సినిమాటిక్ లాంగ్వేజ్‌లో దర్శకుడు ఆవిష్కరిస్తున్నారు. 'దిల్ దియా'ను సమ్మర్‌లో విడుదల చేయటానికి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు. చైతన్యరావు మాదాడి, ఇరా, సఖి, జెస్సీ ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న ఈ చిత్రంలో మణి చందన, ప్రమోదిని, వీర శంకర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

# పుష్ప 2 తర్వాత అల్లు అర్జున్ స్పీడ్..

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ క్రేజ్ 'పుష్ప 2' తర్వాత నెక్స్ట్ లెవల్‌కు చేరింది. ఈ సినిమా ఘనవిజయంతో ఆయన నేషనల్ స్టార్ స్థాయి నుంచి ఇంటర్నేషనల్ రేంజ్‌కి ఎదిగారని చెప్పాలి. స్టైల్, మాస్ ఇమేజ్, పాన్ ఇండియా క్రేజ్‌తో పాటు ఇప్పుడు గ్లోబల్ మార్కెట్‌ను కూడా టార్గెట్ చేస్తున్నాడు అల్లు అర్జున్. ప్రస్తుతం ఆయన తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ కుమార్ దర్శకత్వంలో ఓ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్న విషయం తెలిసిందే. హాలీవుడ్ స్థాయిలో విజువల్స్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు మేకర్స్ ఏకంగా రూ.800 కోట్ల భారీ బడ్జెట్ కేటాయించారని సమాచారం. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ ప్రాజెక్ట్‌పై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో దీపికా పదుకొనే, మృణాల్ ఠాకూర్ హీరోయిన్లుగా నటిస్తున్నారు.

అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఈ సినిమా 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉందని టాక్. ఇదిలా ఉంటే, సినిమాలతో పాటు అల్లు అర్జున్ ఇప్పుడు బిజినెస్ రంగంలోకి కూడా భారీగా అడుగుపెట్టాడు. 'అల్లు సినిమాస్ (Allu Cinemas)' పేరుతో ఓ గ్రాండ్ మల్టీప్లెక్స్‌ను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నాడు. హైదరాబాద్‌లోని కోకాపేట ప్రాంతంలో ఈ భారీ థియేటర్ నిర్మాణం జరుగుతోంది. విశేషమేంటంటే... ఇది దేశంలోనే అతిపెద్ద డాల్బీ సినిమా స్క్రీన్ అవడం. ఈ మల్టీప్లెక్స్‌లో ప్రేక్షకులకు అంతర్జాతీయ స్థాయి అనుభూతిని అందించేందుకు అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు.
75 అడుగుల వెడల్పుతో భారీ స్క్రీన్, అద్భుతమైన విజువల్స్ కోసం డాల్బీ విజన్ 3D ప్రొజెక్షన్, పవర్‌ఫుల్ సౌండ్ కోసం డాల్బీ అట్మాస్ సౌండ్ సిస్టమ్, ఇలా ప్రతి అంశాన్ని టాప్ లెవల్‌లో డిజైన్ చేస్తున్నారని తెలుస్తోంది. ఈ భారీ థియేటర్ ఓపెనింగ్‌ను సంక్రాంతి పండుగ సందర్భంగా ప్లాన్ చేస్తున్నారని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇంకా ఆసక్తికర విషయం ఏమిటంటే... ఈ థియేటర్ ప్రమోషన్స్ కోసం స్వయంగా అల్లు అర్జున్ రంగంలోకి దిగనున్నాడు. త్వరలోనే ప్రమోషనల్ కార్యక్రమాలు మొదలయ్యే అవకాశముందని సమాచారం. మొత్తానికి, అల్లు అర్జున్ ప్రస్తుతం సినిమాల్లోనూ, బిజినెస్‌లోనూ ఫుల్ స్పీడ్‌లో దూసుకెళ్తూ ఐకాన్ స్టార్‌కు తగ్గ రేంజ్‌ను మరోసారి ప్రూవ్ చేస్తున్నాడు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com